కొత్తబంగారు

చక్కటి కుటుంబ కథ పత్రిక

సెప్టెంబర్ - 29

"మ్యూజిక్ కంపోజ్ చేయడానికి ఆస్ట్రియా వెళ్తున్నారట...?" అనడిగాడు ఆ సాయంత్రం ఫోన్ చేసిన హరి.

"ఏమో నాకు తెలిదే" అన్నాడు ఫిల్మ్ డైరెక్టర్ జీవన్.

"మధ్యాహ్నం మా షూటింగ్ దగ్గర కొచ్చినప్పుడు చెప్పేడు జార్జి ప్రసాద్" అనేసి ఇంకా వేరే సంగతులు మాటాడేడు.

రాత్రి ఎనిమిది గంటలప్పుడు జార్జి ప్రసాద్ కి ఫోన్ చేసి అడిగితే "ఔనండి మ్యూజిక్ డైరెక్టర్ యోగి కి పాస్ పోర్టు లేదు. దాని కోసం ట్రై చేస్తున్నాం..... నేనిక్కడ వేరే పనిలో ఉన్నాను, పొద్దుటొచ్చి కలుస్తాను" అన్నాడు.

మూడ్నెళ్ళ క్రితమే గదా ఆస్ట్రియా వెళ్ళేను. అక్కడికి ఎందుకు..? హంగేరీ గానీ పోలెండ్ గానీ అయితే బాగుంటది గదా అనిపించింది జీవన్ కి.మర్నాడు పొద్దుట వచ్చి కల్సిన జార్జి ప్రసాద్ "వేరే యూనిట్ పాటల షూటింగ్ కి వెళ్తుంటే అందులో మిమ్మల్ని, యోగిని జాయిన్ చేద్దాం అనుకుంటున్నాను మీరేవంటారు..?" అన్నాడు.

"వెళ్ళే వాళ్ళెవరు...?"

"సలీం అని పాత ప్రొడ్యూసరే"

"ఆఁ.... ఆఁ.... తెల్సు తెల్సు, ఊళ్ళో చాలా హోటల్సున్నాయి అతనే గదా..?"

"ఆ అతనే.... నాకు చాలా మంచి ఫ్రెండ్. వాళ్ళ సిస్టర్ షహనాజ్ కి సంబంధిచిన ప్రాబ్లమ్స్ తో చాలా టెన్షన్ పడుతున్నాడు సార్. దాంతో ఈ ఫారిన్ ట్రిప్ నన్ను చూడమని రిక్వెస్ట్ చేస్తున్నాడు" అన్నాడు జార్జి ప్రసాద్.

"నువ్వెళ్ళు.., నేనెందుకూ...?" అన్నాడు జీవన్.

“అలాగ్గాదు..., ఆ యోగి కి సినిమాలు చాలా ఉన్నాయి. ఇక్కడుంటే ఒకటి రెండు హాఫ్ డే లు మించి దొరకడు. అక్కడికి తీసుకెళ్ళి పడేశావనుకోండి, కనీసం ఏభైకి తక్కువగాకండా చేస్తాడు ట్యూన్లు. అందులోంచి మీరో అయిదు ఏరుకోవచ్చు...! నేనిప్పుడు సలీం భాయి ఇంటికెళ్తున్నాను. మీరూ రండి దార్లో మాటాడుకుందాం” అన్నాడు.

పంజాగుట్ట స్మశానం దాటింది కారు.

షహనాజ్ భలే పేరు.., చాల సేపు ఆలోచిస్తూ ఉండిపోయిన ఫిల్మ్ డైరెక్టర్ జీవన్ “ఆవిడ ప్రాబ్లమేంటి..?” అన్నాడు.

“వచ్చే నెల్లో జరగాల్సిన షహనాజ్ పెళ్ళి, వజీర్ అనే వాడు చాలా గట్టిగా అడ్డుపడేసరికి ఆగిపోయింది..... ఇలా కాదు మీకు బాగా అర్థం కావాలంటే ఇంకాస్త డీటెయిల్డ్ గా చెప్పాలి” అన్నాడు.

కారు లకిడి కాపూల్ దాటింది.

“ప్రశాసన్ నగర్ లో ఉంటున్న డాక్టర్ అబూతో షహనాజ్ పెళ్ళి సెటిలయ్యింది. తాజ్ కృష్ణాలో గజల్స్ గ్రూప్ లో తబలా వాయించే వజీర్ అనే వాడు “నాకు దక్కాల్సిన షహనాజ్ ని నువ్వు చేసుకోవడం ధర్మ కాదు. మేమిద్దరం ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకున్నాం” అన్నాడు.

”“మీరిద్దరూ ప్రేమించుకున్నట్టు ఆధారాలున్నాయా...?”

“చూపిస్తే నీకు షహనాజ్ తో నేను దగ్గరుండి పెళ్ళి జరిపిస్తాను. చూపించకపోతే ప్రొఫెషనల్ కిల్లర్స్ తో నిన్ను చంపిచేస్తా” నన్నాడు అబూ.మొజాంజాహి మార్కెట్టు దాటి అజాంషాహీ రోడ్డులోంచెళ్తుంది కారు.“పెళ్ళి వాయిదా పడింది అందుకన్న మాట..? మరి షహనాజ్ ఏవంటుంది..?” అన్నాడు జీవన్.

“ఒకేచోట అతను తబలా, నేను వయోలిన్ నేర్చుకున్నాం. చాలా సార్లు నా వెనకబడేవాడు. పిచ్చివాడిలా ప్రవర్తించేవాడు. ఒకసారి నా బర్త్ డే ఆశీర్వదించండి, మీరు నా ఆరాధ్య దేవత అని నా కాళ్ళ మీద పడ్డాడు. ఇంకోసారి రక్తంతో ఉత్తరం రాసేడు. ఇలాంటివి

చాలా చేసేడు. అతన్తో నాకు ఎలాంటి సంబంధం లేదు" అని చెప్పింది షహనాజ్."ఆ వజీర్ గాడెవడో మహర్షి సినిమాలో హీరోలాగున్నాడండి" అన్నాడు జార్జి ప్రసాద్.చార్మినార్ ఇంకా రాకుండానే ఎడం పక్కకి తిప్పాడు కారుని. అది కంకణ్ రోడ్డట. దారి పొడుక్కీ కంసాలి దుకాణాలే. ఠక్ ఠకా ఠక్ ఠకా... సౌండ్లతో ఆ విధంతా గోల, సౌండ్ పొల్యూషన్. అది దాటి మిఠారి మండీ వేపెళ్ళాడు.

నిజామ్స్ మ్యూజియం అవతలి రోడ్డులో ఎకరం నేలలో ఉన్న పురాతనమైన హవేలి. అదే సలీం ఇళ్ళు. ఎటు చూసినా ముస్లిం కల్చరు. నెమలి పింఛం రంగు వేసి ఉన్న ఆ హవలీకి ముందు ఆర్చిలున్నాయి. అర్ధ చంద్రాకారంలో ఉన్న ఆ కొయ్య గుమ్మాలకి చాలా గొప్పగా చెక్కబడి ఉన్నాయి నగిషీలు. వందేళ్ళ కాలం నాటి ఆ పురాతనమైన భవనం ముందు రకరకాల రంగుల పూలు పూస్తున్న గులాబి మొక్కలు పెరుగుతున్నాయి.

కారు దిగగానే వయోలిన్ నాదం వినిపించింది. భీమ్ సేన్ జోషి కనిపెట్టిన హిందోళ బహార్ అనే రాగం అది. అరకు లోయలో చలి కాలపు రాత్రి మంచు – వెన్నెల కలిసి కురుస్తున్నంత హాయిగా ఉంది. ఒక్క క్షణం మనసు తన్మయత్వంతో ఊయాలూగింది.కాలింగ్ బెల్ నొక్కాడు జార్జి ప్రసాద్.

వయోలిన్ సౌండాగింది. కాసేపటికి ఆ పెద్ద పెద్ద తలుపులు తెరుచుకున్నాయి. నల్లటి బురఖా వేసుకున్న ఆ అమ్మాయి కళ్ళు విశాలంగా ఉన్నాయి. కాంటాక్ట్ లెన్స్ లు పెట్టుకున్నట్టు నీలం రంగు కనుపాపలు అందంగా మెరుస్తున్నాయి. ఆ కళ్ళల్లో వెన్నెల కురుస్తోంది."సలీం భాయి లేడా..?" అన్నాడు జార్జి ప్రసాద్.

నమాజ్ కెళ్ళి ఇంకా రాలేదందామె.

"నెనొచ్చినట్టు చెప్పమని" కారు స్టార్ట్ చేశాడు జార్జి ప్రసాద్.

"ఎవరామ్మాయి..?" అడిగాడు జీవన్

"షహనాజ్" అన్నాడు జార్జి ప్రసాద్.

కారు ముందుకు కదిలింది. వయోలిన్ నాదం మళ్ళీ మొదలైంది. జీవన్ మాత్రం ఆ కళ్ళ దగ్గరాగిపోయాడు.

ఆది కవులు వాళ్ళ కావ్యాల్లో వర్ణించారేమో.

అంత గొప్ప కళ్ళని జీవనెక్కడా చూళ్ళేదు. బహుశా నిత్యం కలలు కనే కళ్ళు అంటే అవేనేమో...! కళ్ళే అంత అపూర్వంగా ఉన్నాయంటే, ఇక మనిషెంత గొప్పగా ఉంటుందో అనుకున్నాడు. ఇక రోజంతా ఏం చేస్తున్నా ఆ కళ్ళు జీవన్ని వెంటాడుతూనే ఉన్నాయి. ఎప్పటికయినా ఆ మనిషి సంపూర్ణ రూపం చూడాలని పెద్ద శపథమే చేసుకున్న జీవన్ కి ఆ రాత్రంతా రకరకాల కళ్ళు గుర్తుకొచ్చాయి. సీత కళ్ళు, సావిత్రి కళ్ళు, కృష్ణుడి కళ్ళు, రాముడి కళ్ళు, జమున కళ్ళు, వాసంతి కళ్ళు, వెన్నిరాడై నిర్మల కళ్ళు, జయంతి కళ్ళు, పుష్పలత కళ్ళు, పుష్పవల్లిక కళ్ళు, శ్రీదేవి కళ్ళు, రేఖ కళ్ళు, భానుప్రియ కళ్ళు... కానీ, షహనాజ్ కళ్ళ ముందు ఆ కళ్ళన్నీ తేలిపోయాయి.ఈ ప్రపంచంలో ఎంత గొప్ప కళ్ళని చూపించినా షయనాజ్ కళ్ళ ముందు అవన్నీ దిగదుడుపనిపించాయి జీవన్ కి.

ఎందుకో...

తనకి తెలికండానే ఆ షహనాజ్ తనకి సొంతమయిపోయింది. తన ఆరాధ్య దేవతైపోయింది. ఆ షహనాజ్ సమస్య తన సమస్య అయిపోయింది. ఆ షహనాజ్ బాధ తన బాధయిపోయింది. షహనాజ్ వేదన తన వేదనయిపోయింది. రీజన్ లేదు.



ఆ తర్వాత.....

.....

సెప్టెంబర్ – 30

ఫ్లైట్ తెల్లవారుజాము నాలుగు గంటలకయితే పన్నెండింటికే వచ్చేసింది వాళ్ళ కంపెనీ కారు. మేనేజరు హరి కి ఫోన్ చేసి "అప్పుడే పంపించేసేవేంటి..?" అన్నాడు జీవన్.

"సార్, కారు మీ ఇంటి ముందుంటుంది. టైమయ్యాకా ఎయిర్ పోర్ట్ నించి ప్రొడ్యూసర్ జార్జిప్రసాద్ గారు ఫోన్ చేస్తారు అప్పుడు బయల్దేరండి" అన్నాడా మేనేజరు.

రెండు గంటలకి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కొచ్చే సరికి ఈ టూర్ కండక్ట్ చేసే వేణు గారు లాంజ్ లో హడావుడిగా తిరుగుతూ కనిపించాడు. మేకప్ మేనూ, దోబీ, కో – డైరెక్టరు గంగరాజు, కొత్త డాన్సు మేస్టరూ వాడి అసిస్టెంటూ, కెమెరా, నాగరా కి సంబంధించిన మనుషులూ, ఇంకా రాజమండ్రి నించొచ్చిన జార్జి ప్రసాదు ఫ్రెండ్సు గోవిందు, చందర్రావూ లాంజ్ లో కూర్చుని ఉన్నారు.

"మేమిద్దరం ఇంకో దేశం వెళ్లడం ఇదే ఫస్టు టైమ్ సార్" అన్నాడు చందర్రావు.

"అసలు విమానం ఎలాగుంటుందో చూడ్డం ఫస్టు టైమ్ ముందది చెప్పు" అన్నాడు గోవిందు.

"ఇలాగంటే అలాగని అర్థంగాదేంటి ఈయన గారికి" అని ఎదో గుర్తొచ్చినట్టు జీవన్ దగ్గర కొచ్చిన చందర్రావు "చూడండి గురూ గారూ, విమానం గాల్లోకి ఎగిరినప్పుడు నా కళ్ళు తిరిగినా, దాని కుదుపుకి కింద పడినా మీరు కాస్త చూసుకోవాలి మమ్మల్ని....! నాకు కొంచెం హార్టు ట్రబులుంది. విమానం పైనున్నప్పుడు నెప్పిలాంటిదేవయినా వస్తే డాక్టర్లుంటారు గదా..?" అన్నాడు.

అంతలో వచ్చిన ప్రొడ్యూసర్ జార్జి ప్రసాద్ "అప్పుడే మొదలెట్టేసేవా ఎదవ గోల..?" అంటూ డైరెక్టర్ జీవన్ కి అయిదు వేల యూరోలు ఇచ్చి ఏదో మాటాడ్తున్నవాడల్లా, బుక్ స్టాల్ పక్కనున్న ఇంకో షాపు వేపు చూసే సరికి అక్కడున్న బెల్టులు, తాళం కప్పలు లాంటివన్నీ కొనేస్తూ కనిపించేడు గోవిందు. అతని దగ్గరికెళ్ళిన జార్జి ప్రసాదు "ఇవన్నీ ఎందుకురా..!?" అన్నాడు.

"ఎందుకంటావా...?" అడిగేడు గోవిందు.

"ఎందుకూ..?" అన్నాడు జార్జి ప్రసాదు.

“ఏమో నాకేం తెల్సు ఈ చందర్రావు గాడు కొనమంటే కొంటున్నాను” అనే సరికి గిర్రుమని చందర్రావు వేపు తిరిగిన జార్జి ప్రసాదు “ఎందుకురా ఇవన్నీ కొనమన్నావ్ వాడ్ని..?” అన్నాడు.

“ఎందుకంటే...” అంటూ తలొంచేసుకూర్చున్న చందర్రావు “ముందలా బెదరగొట్టకు” చెపుతాను.

“ఎందుకంటే..., ఫస్ట్ టైం ఫారినెళ్ళావ్ మాకేం తెచ్చావ్..? అని మా ధవిళేశ్వరంలో మా రధం వీది జనం అడిగితే వాళ్ళకి నేనేం సమాధానం చెప్పాలి...! అందుకు కొనమన్నాను” అని ఫినిష్ చేసేడు.

“మనం ఇంకా ఫారిన్ లో పాదం పెట్టలేదు గదా” అన్న గంగరాజు గూబ మీద లాగి కొట్టేసిన చందర్రావు “ఫారిన్ వేళ్ళలేదని నాకు తెలీదా..? అక్కడ ఆళ్ళు చెప్పే రేట్లకి మనం తూగగలమో లేదో అని ముందు జాగ్రత్తతో ఇవన్నీ కొనిపిస్తున్నాను” అని అక్కడ్నించెళ్ళిపోయాడు.ఈలోగా వాళ్ళ మమ్మీ డాడీతో పాటు దిగింది కొత్త హీరోయిన్ హరిప్రియ.

“యూనిట్లో అంతా నన్నో తోబుట్టువులాగ చూస్తారు. వీళ్ళంతా ఉండగా మీరెందుకు చెప్పండి..?” అని గట్టిగా చెప్పడంతో ఆమె తాలూకు వాళ్ళెవరూ కూడా రావాడం లేదట. ఓ పక్క అందరితోనూ మాటాడ్తూనే ఎంట్రన్స్ గేటు వేపు చూస్తుంది హరిప్రియ.

కాస్సేపటికి దిగిన కొత్త హీరో అనిల్ ని వాళ్ళ పేరెంట్స్ దగ్గరికి తీసుకెళ్ళి పరిచయం చేసింది. ఇంకాస్సేపటికి ఇద్దరు ఫోటోగ్రాఫర్లనీ, ఒక వీడియో తీసే అతన్నీ, దగ్గరుండే మొత్తం స్టాఫ్ నీ వేసుకుని దిగిన మ్యూజిక్ డైరెక్టర్ యోగి ఎయిర్ పోర్టంతా హడావుడి చెయ్యడం మొదలెట్టాడు. అంతలో ఎవరో ఇద్దరొచ్చి నాలుగు దండలేసారు.

“ఎవర్రా వాళ్ళు..?” యోగి ని అడిగాడు జీవన్.

“ఫాన్స్, వరంగల్ నుంచి వచ్చారు” అన్నాడు.

“ఎయిర్ పోర్ట్ కొచ్చి దండలు వెయ్యడానికి నువ్వు కిరాయికి పెట్టుకున్న మనుషులు వాళ్ళు ఔనా..?” అన్నాడు జీవన్.

“ఊరుకోండి సార్, నేనేం చేసినా ఏదో వంక పెడతారు” అంటూ ఎవరో పిల్చినట్టు యాక్ట్ చేస్తూ ఇంకో పక్కకెళ్ళిపోయాడు.

“నే వెళ్ళి ఎయిర్ పోర్ట్ మేనేజర్ని కలుస్తాను” అని వేణూ అరుస్తుంటే ఏంటా అని అటు వేపు వెళ్ళారీళ్ళు. నెగిటివ్ స్కేన్ చేస్తాం అంటారు వాళ్ళు. చేసేటప్పుడు కన్వేయర్ బెల్ట్ మీద ముందుకెళ్ళాలి గానీ మళ్ళీ వెనక్కి రాకూడదు. అలా వస్తే ఇంకది షూటింగ్ కి పనికి రాదు అంటాడు వేణు. అక్కడో చిన్న సైజు గొడవ మొదలైంది.

కాస్సేపటికి జార్జి ప్రసాదు పార్టనర్ జాస్తి చౌదరి, కన్నారావు వచ్చారు.

ఈ ఫ్లైట్ లో జర్నీ చేసే జనాల కంటే వాళ్ళని సాగనంపడానికొచ్చిన జనాల్తో కళకళ్ళాడిపోతుందా ఎయిర్ పోర్టు.

మామూలుగా మెయిన్ గేటు వేపు చూసిన జీవన్ అలా ఉండిపోయేడు.

చేతిలో వయోలిన్ బాక్సుతో షహనాజ్.

అంతలో,

మాటాడ్తున్న సెల్ కట్ చేసి టెన్షన్ తో ఊగిపోతూ వచ్చాడు సలీం భాయి. మెయిన్ హీరో సందేశ్ మూడు రోజులు లేటుగా వస్తానని కబురు చేశాడట లాస్ట్ మినిట్ లో. “అసలే నా ప్రర్సనల్ ప్రాబ్లమ్స్ తో నే చస్తుంటే ఏంటి భాయూ ఇది” అన్నాడు సలీం.

ఆ సినిమా డైరెక్టరైన వేగేశ్వర్, డాన్స్ మేస్టరు అశోక్ అక్కడికొచ్చి మొత్తం మేటరంతా విని “మీరేం టెన్షన్ పడకండి సార్, మెయిన్ హీరో గారు వచ్చేలోగా ఆ కొత్తోళ్ళిద్దరితో మేనేజ్ చేస్తాం” అన్నారు.

ఇంకా రిపోర్టింగ్ టైం అవ్వకపోవడంతో యూరప్ వెళ్ళే సినిమా యూనిట్లో వాళ్ళంతా ఎయిర్ పోర్ట్ లో

కలియతిరుగుతున్నారు.జీవన్ మాత్రం ఒక మూలనున్న చెయిర్లో కూర్చున్న షహనాజ్ నే చూస్తున్నాడు. తనని మర్చిపోయి చూస్తున్నాడు. ఒక తన్మయత్వంతో చూస్తున్నాడు. ఒకానొక అనుభూతితో చూస్తున్నాడు. అలా చూస్తున్న జీవన్ కి పాకీజా సినిమాలో మీనా కుమారీ, మధుమతి లో వైజంతిమాలా, మూగ మనసులు లో సావిత్రి, ఆమె ఎవరు? లో జయలలిత, పరాక్ లో సాధన, కాగజ్ కే ఫూల్ లో వహిదా రెహమాన్, తలాష్ లో షర్మిలా ఠాగోర్ గుర్తుకొస్తున్నారు. వాళ్ళందరి కళ్ళు గుర్తుకొస్తున్నాయి.

షహనాజ్ కళ్ళ ముందు వాళ్ళందరి కళ్ళు దిగదుడుపే అనిపిస్తుంది.

హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్ళే ఆ విమానం నాలుగు గంటలకి టేకాఫ్ అవుతుండగా సేఫ్టీ బెల్టులు పెట్టుకోమని ఎనౌన్స్ చేస్తుంటే... ఫస్ట్ టైం ఫ్లైట్ జర్నీ చేస్తున్న యోగి పొరపాటున జీవన్ రెండు బెల్టుల్లో ఒకటి కట్టేసుకుని ఎయిర్ హోస్టెస్ తో తిట్లు తిన్నాడు. ఇడ్లీ సాంబారని చెప్పి రెండు అట్ట ముక్కల్లాంటి వాటి మీద సాంబారు రంగులో ఉన్నదేదో వేసిచ్చిన ఎయిర్ హోస్టెస్ తో ఇంగ్లీషులో ఆర్గ్యుమెంట్ పెట్టుకున్న చందర్రావు కేసి చూస్తూ నవ్వుకుంటున్నారు ప్యాసింజర్లంతా. ఆఖరికి చిరాకులో ఉన్న సలీం కూడా నవ్వేశాడు. ఈలోగా అక్కడికొచ్చిన జార్జి ప్రసాదు, చందర్రావు ని తెగ తిట్టి "నోర్మూసుకుని కూర్చో" అన్నాడు.

దూరంగా సలీం పక్కన కూర్చున్న షహనాజ్, కిటికీలోంచి దూదిలా తేలిపోతున్న మేఘాలను చూసుంది. ఆమె ఒడిలో నిద్రపోతున్న పసిపాపలా ఉంది వయోలిన్. ఏవో లోకాల్లోకి చూస్తా మౌనాన్ని మోస్తున్నాయి ఆవిడ కళ్ళు.

ప్రతీ సీటు ముందు ఫిక్స్ చేసి ఉన్న మానిటర్లో ఫ్లైట్ మాప్ కనిపిస్తుంది. ముంబై, అహమ్మదాబాదు, కరాచి దాటుకుంటూ అరేబియా సముద్రం మీదుగా దుబాయ్ వేపు ప్రయాణం చేస్తుందా విమానం.

ఎయిర్ క్రాఫ్ట్ క్రూ చూపించే ఇంగ్లీషూ, హిందీ సినిమాలూ, రకరకాల గేమ్సూ ఉన్నాయి. ఇంకా మనం ప్రత్యేకంగా చూసుకోవాలంటే వాళ్ళ దగ్గరున్న కొన్ని సినిమాల లిస్టు సీటు ముందు బ్యాగ్ లాంటి దాంట్లో ఉంది. అది చూసి పేరు చెబితే కేవలం మనం మట్టుకే సినిమా చూసుకునే సౌకర్యం కల్పిస్తూ ప్లే చెయ్యబడుతుంది.

అలాగే, విమానం ఆకాశంలో ప్రయాణం చేస్తుండగానే ప్రపంచంలో ఎక్కడికైనా మనం ఫోన్ మాటాడుకునే అవకాశం ఉంది. అయితే మన ఇంటర్నేషనల్ బ్యాంక్ కార్డ్ ఫోన్లో ఇన్ సర్ట్ చేసి మాటాడ్డం మొదలెడితే నిమిషానికి అయిదు యూరోల చొప్పున మన ఎకౌంట్ లో కరెన్సీ తీసుకుంటారు. అదే ఫోన్ ద్వారా ఫ్లైట్ లో వేరే సీటులో ఉన్న వాళ్ళతో మాటాడుకోవచ్చు. దానికి చార్జీ లేదు. అదెలాగంటే ఫోన్ రిసీవరుకున్న బటన్స్ మీద మనం ఎవరితో మాటాడాలనుకుంటున్నామో ఆ మనిషి కూర్చున్న సీట్ నంబర్ ప్రెస్ చెయ్యాలి. ఎవరి ద్వారానో ఫోన్ చెయ్యడం నేర్చుకున్న యోగి, కో – డైరెక్టర్ గంగరాజు తో మాటాడదామనిపించి అతని సీటు నంబర్ G.24 డయల్ చేశాడు. నిజానికి గంగరాజు నెంబర్ G26. రాంగ్ నంబర్ నొక్కడం వల్ల ఫోన్ గాడ్డంగా

నిద్రపోతున్న ఒక అరబ్ షేక్ కి కనెక్టయ్యింది. ఫోన్ రింగ్ కి ఉలిక్కిపడి లేచిన షేక్ “హలో” అన్నాడు.

అట్నుంచి యోగి “టోను మారుస్తావేంట్రా గంగరాజు...?” అన్నాడు.

చిరాకు పడిపోయిన షేక్ అరబిక్ భాషలో తిట్టాడు.

నవ్వేసిన యోగి “మనం ఫ్లైటెక్కి నాలుగ్గంటలన్నా కాలేదు. అప్పుడే అరబ్బుల భాష నేర్చేసుకున్నావ్రా ఇడియట్..?” అన్నాడు.ఇడియట్ అన్న ముక్క చాలా బాగా అర్థమైంది షేక్ కి. తనకి ఫోనెవరు చేశారో ఎయిర్ హోస్టెస్ ద్వారా తెల్సుకుని, దీపావళి నైటు నేలబారున వదిలిన తారాజువ్వలా దూసుకుంటూ యోగి దగ్గర కొచ్చి కాలరు పట్టుకుని మెడ కొరికెయ్యబోతుంటే ఏం మాటాడాలో అర్థం కాని యోగి “గంగరాజనుకున్నాను.... గంగరాజనుకున్నాను” అంటున్నాడు.

“అది కాదు సాయిబూ మావోడు.... అది నీ సీటనుకోలేదురా” అని ఆ అరబ్ షేక్ భుజం మీద చెయ్యి వేసిన గంగరాజు గూబ మీద పెద్ద సొందొచ్చేలాగ కొట్టేడు.

దాంతో ఉలిక్కిపడ్డ ఫ్లైట్లో వాళ్ళంతా ఒకేసారి ఇటు తిప్పారు వాళ్ళ తలకాయలు.

చెంప తడుముకుంటున్న గంగరాజుని భుజం పట్టుకుని నడిపించుకెళ్తున్నాడు యోగి...! నడుస్తున్న గంగరాజు బ్రేకు లేసినట్టు ఠక్కున ఆగిపోయేసరికి “మళ్ళీ ఏవయింది..?” అన్నాడు యోగి.“ఆ కొత్త హీరోయినూ, కొత్త హీరో గాడూ చూడు ఒకళ్ళనొకళ్ళు ఎలా కర్చుకుపోయి కూర్చున్నారో..! ఆ ఉలెన్ శాలువా ఎంత నైసుగా కప్పుకున్నారో చూడు...” అన్నాడు గంగరాజు.

“ఎందుకు ఆళ్ళని చూసి అంత కడుపు మంట..? నువ్వు కూడా ఈ విమానంలో ఏ తురక పిల్లనో చూసుకోకూడదు...” అన్నాడు యోగి.“నా బాధ అందుకు కాదెహె...”

“మరెందుకెహె...?”

“ఆ పిల్ల వాళ్ళమ్మని, నాన్నని తన కూడా ఎందుకు రావద్దంటో ఇప్పుడర్థమయినందుకు” అన్నాడు గంగరాజు.విండో సీట్ దగ్గర కూర్చుని బయటి చీకటినే చూస్తున్న షహనాజ్ నే చూస్తున్నాడు జీవన్.

ఆ చీకటిని చూస్తానే ఏవేవో కలలు కంటున్నట్టు కళ్ళు కాసేపు మూస్తుంది, కాసేపు తెరుస్తుంది. మధ్య మధ్యలో నవ్వుకుంటుంది.అదంతా చూస్తున్న జీవన్ ఆ షహనాజ్ ని చూస్తా ఎక్కడికో ఎక్కడెక్కడికో వెళ్ళిపోతున్నాడు.

ఆ షహనాజ్ మట్టుకి జీవన్ని చూడ్డం లేదు.

జీవన్ మట్టుకామెనే చూస్తున్నాడు. చూస్తానే ఊహించుకుంటున్నాడు. ఎన్నో ఊహలు, ఎన్నెన్నో ఊహలు, ఎన్నెన్నో అందాలు, చూడచూడ బంధాలు అని పాడుకుంటున్నాడు.

అక్టోబర్ – 1

ఉదయం ఎనిమిది గంటలకి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లో ఆగింది ఫ్లైట్.

ఏరో బ్రిడ్జిమించి సెక్యూరిటీ చెకింగ్ వేపొచ్చారంతా.

మెటల్ రింగ్స్ ఉన్న బూట్లు వేసుకున్న యోగిని విప్పమన్నారు పోలీసులు. రాజమండ్రి నుంచొచ్చిన గోవిందు మీద ఏం అనుమానం కలిగిందో వాళ్ళకి బూట్లు, బెల్టుతో పాటూ బట్టలన్నీ విప్పించారు. చారల పట్టా పట్టీ డ్రాయరుతో అందరి ముందూ నిలబడ్డానికి చాల ఇబ్బంది పడిపోతున్నాడు గోవిందు. తనకేసి చూసి ఊగిపోతూ తెగ విరగబడి నవ్వుతున్న హరిప్రియని చూసి చాలా మండిపోయిన గోవిందు, దుబాయ్ పోలీసుల్ని పిల్చి “ మీకు అనుమానమొచ్చింది మగోడ్ని గాబట్టి నా బట్టలన్నీ విప్పించెయ్యగలిగేరు. ఆ పిల్ల మెల్లో ఏముందో ఏంటో ఓసారి విప్పించి చూడండి” అన్నాడు.

అర్థం కాని దుబాయ్ పోలీసు తన ఇనప బూటుతో గీవిందు కాలు తొక్కేసాడు.

మెటల్ డిడెక్టర్ తో గోవిందు శరీరమంతా డిటెక్ట్ చేస్తే సరిగ్గా కుడి కాలు దిగాక కుయ్... కుయ్ మని సౌండు రావడంతో ఆ డిటెక్ట్ చేస్తున్న వాడికేం అర్థం కావడం లేదు. తెగ కన్ఫ్యూజ్ అయిపోతుంటే... ఏంటంటూ వాడి పై అధికారి వచ్చాడు. అతని పరిస్థితే అదే. డిటెక్టర్ మోకాలి కింద పెట్టినప్పుడల్లా సౌండొస్తుంది. చివరికి తెల్సిందేంటంటే ఎప్పుడో గోవిందు కాలు విరిగినప్పుడు లోపల మెటల్ రాడ్ వేశారట. అదీ సంగతి..!"ఆ షహనాజ్ మనతో ఎందుకు వస్తుంది...?" జార్జి ప్రసాద్ నడిగాడు జీవన్."రెండు వారాలు టైమిస్తే షహనాజ్ తనని ప్రేమించిన సాక్ష్యాలు చూపిస్తానని ఛాలెంజ్ చేసాడట. అలా చూపించగల్గితే నేను నిన్ను పెళ్ళి చేసుకోడానికి సిద్ధం అందట షహనాజ్.""ఒకవేళ చూపించకపోతే నిన్ను ప్రొఫెషనల్ కిల్లర్స్ తో చంపించేస్తాను" అన్నాడట సలీం."ఆ వజీర్ చాలా తేడా మనిషి, నందిని పంది చెయ్యగలడు. ఇటు చూస్తే భాయి షూటింగ్ కి వస్తున్నాడు"."ఇంట్లో ఒంటరిగా ఉండే షహనాజ్ ని ఆ వజీర్ ఎలాంటి హింసకి గురి చేస్తాడో అని ఆమెను కుడా ఆస్ట్రియా తీసుకొస్తున్నాడు సలీం" అని చెప్పాడు జార్జి ప్రసాద్.

"14 రోజుల పాటు నరకం అనుభవించాలన్నమాట షహనాజ్" అనుకున్నాడు జీవన్.

జీవనలా అనుకుంటుండగా సరాసరి తనే జీవన్ దగ్గరికొచ్చి కళ్ళతోనే తనతో మాటాడినట్టు, ఆ కళ్ళని చూస్తూనే నీ సంపూర్ణమైన రూపం ఎప్పుడు చూపిస్తావు...? అని నిశ్శబ్దంగా అడిగినట్టూ, ఆమె నిశ్శబ్దంగా నవ్వినట్టూ అనిపించినా జీవన్, షహనాజ్ ని ఊహించుకుంటూ ఏవేవో కలలుగన్నాడు.

అక్టోబర్ – 2

గంట తర్వాత జర్మనీ లో ఉన్న మ్యూనిక్ వెళ్ళే ఎమిరేట్స్ విమానం ఎక్కారంతా.

ఎనిమిది గంటల ప్రయాణం.

దుబాయ్ నుంచి రకరకాల ముస్లిం కంట్రీలు దాటుతుంది ఎమిరేట్స్ విమానం.

అమ్మాన్, ట్రిపోల్, అదెన్స్, మాల్టా దాటుకుంటూ బ్లాక్ సీ వేపెళ్తుంది విమానం.

మేం అడిగిన కోగ్ నేక్ బ్రాందీ, మాల్ట్ విస్కీలూ, వెజిటబుల్ సలాడ్సూ, సాల్ట్ మిక్స్ చేసిన కేష్యూ పిస్తా బాదం పప్పుల్ని చాలా ఓపిగ్గా అందిస్తున్నారు అందమైన ఆ ఎయిర్ హోస్టెస్ లు.

షహనాజ్ చేతిలో ఉన్న వయోలిన్ మామూల్ది కాదు. అదో లేటెస్ట్ వయోలిన్. ఎలక్ట్రిఫైడ్ వయోలిన్.

దానికున్న అవుట్ పుట్ సాకెట్ కి హెడ్ ఫోన్ కేబుల్ కి కనెక్ట్ చేసి విమానంలో ఉన్న వాళ్ళెవరికీ డిస్ట్రబ్ కాకుండా తను మాత్రమే వింటూ రకరకాల ఆలోచనల్లోకెళ్ళిపోతూ వాయిస్తోంది వయోలినాన్ని.

ఎన్ని హిందుస్థానీ రాగాలో.... ముఖ్యంగా పహాడీ రాగంలో ఆజారే పరదేశి, శివరంజని లో మేరే నైనా సావన్ బాదో, వీటి తర్వాత గులామ్ అలీ గజల్స్ మాండ్, దర్బారీ పడ్ దీప్, తోడి... రకరకాల రాగాలు ఆ వయోలిన్ మీద పలుకుతున్నాయి.

లంచ్ టైమయ్యింది.

“మీకు ఇండియన్ ఫుడ్ కావాలా..? అరబిక్ ఫుడ్ కావాలా..?” అనడిగింది ఏయిర్ హోస్టెస్.

“ఏది ఆర్డర్ చేద్దాం..?” అన్నాడు గోవిందు.

“ఎదవ ఇండియా భోజనం రోజూ మనింట్లో ఆడోళ్ళు వండేదే గదా..! వెరైటీగా ఉంటది అరబిక్ ఫుడ్ చెబుదాం” అన్నాడు చందర్రావు.“ఓకే, అరబిక్ ఫుడ్” అన్నాడు గోవిందు.

పావు గంటలో ఆమె తీసుకొచ్చిన భోజనం చూసిన చందర్రావు గొళ్ళుమన్నాడు. గుప్పెడంటే గుప్పెడు అన్నం, అర చెయ్యి అంత వెడల్పున్న సగం కూడా ఉడకని తోలు తీసిన చేప ముక్కా, ఒలిచి ఒలవనీ ఉడికీ ఉడకని నాలుగు రొయ్యలూ ఉన్నాయి.ఇవి గాకండా ఆకులు, అలములూ, గడ్డీగాదం ఉన్నాయి.

కారుతున్న కన్నీళ్ళని గోవిందు భుజం మీదున్న టవల్ తో తుడుచుకుంటుంటే అక్కడికొచ్చిన జార్జి ప్రసాద్ "అన్నీ వంకర పన్లే...!" అని చేతిలో ఉన్న చిప్స్ ప్యాకెట్ ఇచ్చి "తిను ఈ పూటకిదే నీ లంచ్" అనెళ్ళిపోయాడు.

ఇండియన్ లంచ్ ఒకటి ఆర్డర్ చేసి తెప్పించుకున్న హరిప్రియా అనిలూ ఒకళ్ళకొకళ్ళు గోరు ముద్దలు చేసి మరీ తినిపించుకుంటున్నారు.అది చూసిన కో – డైరెక్టరు గంగరాజు "అమ్మానాన్నల్ని కూడా రావొద్దని ఈ పిల్ల ఎందుకందో ఇప్పుడర్థమైంది..!" అన్నాడు.

"నాకెప్పుడో అయ్యింది" అన్న యోగి, గంగరాజు కాళ్ళు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

దూరంగా సలీం పక్కన కూర్చున్న షహనాజ్, జీవన్ దగ్గరికొచ్చి మాటాడింది. ఆమె, జీవన్ మాటాడుకుంటుంటే జనమంతా నిద్రపోతున్నారు. పెక్స్ దాటాకా లేక్ బాలాటన్ లో దిగింది విమానం. ఆమె లేక్ ఒడ్డున కూర్చుని చాలా సేపు వయోలిన్ వాయించింది. అక్కడ్నుంచి బుచారెస్ట్ దాటి హంగేరి క్యాపిటల్ అయిన బుడాపెస్ట్ వెళ్ళారు. రెక్వియమ్, సెవెన్త్ సీల్ లాంటి సినిమాలు తీసిన జోల్టన్ పేబ్రి ఇంటికీ వెళ్ళి మాటాడి అక్కడ్నుంచి ఎగురుకుంటూ పోలెండ్ లో దిగారు. వార్సాలో ఉన్న క్రిస్టప్ కిస్లో వస్కి చదువుకున్న ఫిల్మ్ స్కూలుకెళ్ళారు. అక్కడ్నుంచి వియన్నా, ట్రుయీ వెళ్ళారు.

విమానం కుదుపుకి మెలకువ వచ్చింది. అంతా కల, దూరంగా సలీం పక్కనే కూర్చుని ఉంది షహనాజ్. ఎమిరైట్స్ విమానం మ్యూనిక్ ఎయిర్ పోర్ట్ రన్ వే మీద వాలింది.

ఒకటే వర్షం.

ఎయిర్ క్రాఫ్ట్ క్రూ అరబిక్ భాషలోనూ, ఇంగ్లీషులోనూ ధన్యవాదాలు తెలియజేస్తుంటే బయటికొచ్చిన ఏరో బ్రిడ్జి మించి

నడుచుకుంటూ బయటికొచ్చి ఆ తర్వాత ఎస్కలేటర్ లో కిందికి దిగారంతా.

కన్వేయర్ బెల్ట్ మీంచొస్తున్న సామాన్లలో ఎవరిది వాళ్ళు తీసుకుని ట్రాలీల మీదేసుకుని బయటికొచ్చే ప్రయత్నాల్లో ఉండగా ఒక శుభవార్త తెలిసింది. అదేంటంటే...

నెగెటివ్ ఉన్న బాక్సులు ఈ ఫ్లైట్ లో రాలేదట.

అసలే సందేష్ విషయంలో అప్ సెట్ అయిపోయున్న ప్రొడ్యూసర్ సలీం, మరింత డల్ అయిపోయేడు. అతని పరిస్థితి చూసి దగ్గరికెళ్ళిన కో – ఆర్డినేటర్ వేణు "మీరేం టెన్షన్ పడకండి... వచ్చే ఫ్లైట్ లో వస్తాయట ఆ బాక్సులు. నేనిక్కడే ఉండి వాటిని తీసుకుని వస్తాను" అన్నాడు."నేనూ మీతో పాటుంటాను. నెగెటివ్ లేకుండా అక్కడికి వెళ్ళి నేనేం చేస్తాను..?" అని, "ప్రసాద్, వీళ్ళని తీసుకెళ్ళి తక్కిన పన్లన్నీ నువ్వు చూసుకో" అన్నాడు జార్జి ప్రసాద్ తో సలీం.

"సరే" అని అంతా బయటికి కదలబోతుంటే "నా లగేజి రాలేదండి" అన్నాడు కో - డైరెక్టర్ గంగరాజు."అది కూడా ఆ నెగెటివ్ బాక్సులతో పాటు ఉండిపోయి ఉంటుంది. వేణు గారు తెస్తార్లే పద " అన్నాడు జార్జి ప్రసాద్.

"అది కాదండీ బాబూ, నా షేవింగ్ కిట్టూ టవలూ... అన్నీ ఆ సూట్ కేసులో ఉండిపొయినియ్యి, డబ్బులు కూడా. కట్టుబట్టలతో ఉన్నానండీ ఇప్పుడు" ఏడుస్తూ అన్నాడు గంగరాజు.

"అదేదో చూద్దాం లేవయ్యా బాబూ పద ముందు" అన్నాడు జార్జి ప్రసాద్.

"పళ్ళు తోముకోడానిక్కూడా ఏదీ లేదంటే వినిపించుకోరే" అని గంగరాజంటుంటే గబగబా వచ్చేసిన చందర్రావు "దారిలో ఏ వేప పుల్లో విరిచిస్తాంలే పద" అన్నాడు.

"ఈ దేశంలో వేప చెట్లుంటాయా మరి..?" డౌటొచ్చింది గోవిందుకి.

“వేప చెట్లు కాకపోతే తంగేడు చెట్టు, అదీ కాకపోతే నేపాళం చెట్టు ఏదోటి లేకుండా ఎలాగుంటది.”

“వాడేసిన బ్రష్షు కావలంటే నా దగ్గరొకటుంది” అన్నాడు యోగి వాళ్ళ గొడవలా జరుగుతుండగా కాస్త దూరంగా వయోలిన్ బాక్సు తో నిలబడున్న షహనాజ్ దగ్గరికెళ్ళి ఏదో మాటాడి వచ్చిన సలీం, జార్జి ప్రసాద్ దగ్గరికొచ్చి “నేనొచ్చేదాక సిస్టర్ని జాగ్రత్తగా చూసుకో ప్రసాద్ భాయి” అన్నాడు.

వర్షం వదిలేట్టు లేదు.

ఎయిర్ పోర్ట్ బయట వేణు తాలూకూ ఆస్ట్రియన్ డ్రైవర్ హన్సీ, వాళ్ళబ్బాయీ హైటెక్ బస్సు రెడీగా పెట్టుకునున్నారు.

జీవన్ ని పలకరించాడు హన్సీ. అతనూ ఉల్ఫీ అనే అతనూ బస్సు తెచ్చుకుని ట్రిప్ కింతని మాటాడుకుంటున్నారు. డైరెక్టర్స్ కి లోకేషన్స్ లాప్ టాప్ లో చూపించి నచ్చిన వాటి పర్మిషన్లు తీసుకునే పని “ఉస్లా” అనే లేడీ చేస్తుంది.

“ఈ అబ్బాయి ఎవరు..?” అని హన్సీ ని అడిగితే చెప్పాడు వాళ్ళబ్బాయేనట. ఇవాళ స్కూలు లేకపోవడంతో కూడా వచ్చాడట.అది విన్న గోవిందు “అచ్చం మన పిల్లల్లాగే” అన్నాడు.

లగేజీ మొత్తం బస్సులో సర్దేశాక బయల్దేరిన హైటెక్ బస్సు, ఎయిర్ పోర్ట్ దాటుతుంటే పక్కనే ఉన్న రన్ వే మీంచి లుఫ్తాన్సా ఫ్లైటు వెళ్తుంది.



ముందు వరుసలో జీవన్, మ్యూజిక్ డైరెక్టర్ యోగి కూర్చున్నారు. వాళ్లకవతల ఆ సిన్మా డైరెక్టర్ వేగేష్, కెమెరామెన్ వినాయకన్ కూర్చున్నారు. తక్కిన వాళ్ళంతా ఎవళ్ళిష్టానికి వాళ్ళు సర్దుకున్నారు. వెనక మట్టుకు హరిప్రియ, అనిల్ సర్దేసుకున్నారు.చివరి సీట్లో కూర్చున్న షహనాజ్ చంటి బిట్టని పెట్టుకున్నట్టు వయోలిన్ బాక్స్ ని ఒళ్ళో పెట్టుకుంది.

హైటెక్ బస్సు మ్యూనిక్ నగరం దాటి బయటికొస్తుంటే సాల్స్ బర్గ్ 177 కిలోమీటర్లు అన్న బోర్డు చూసి ఒక్కసారిగా కళ్ళు మూసుకున్నాడు జీవన్. మోజార్ట్.... ఓల్ఫ్ గాంగ్ ఎమాడియస్ మొజార్ట్. కటిక దరిద్రంతో ముప్పై ఆరో ఏటే చనిపోయిన మొజార్ట్. ఆయన పుట్టిన ఊరు సాల్స్ బర్గ్. మొజార్ట్ గురించి నా కంటే గొప్పగా వయోలిన్ వాయించే షహనాజ్ కి తెల్సుండాలే అనుకుంటూ వెనక్కి చూశాడు జీవన్.ఆమె కూడా సాల్స్ బర్గ్ బోర్డుకేసే చూస్తుంది.

మళ్ళీ జీవన్ కల మొదలైంది. వెనక్ సీట్లో కూర్చున్న షహనాజ్ వయోలిన్ తీసుకుని సరాసరి జీవన్ దగ్గరికొచ్చి ఉదయ రవిచంద్రిక రాగం వాయిస్తూ రకరకాలుగా విహారాలు చేస్తుంది. ఆ రాగం వింటూ ఆమెనే చూస్తున్నాడు జీవన్.

సిక్స్ వే రోడ్ మీద ట్రాఫిక్ రూల్స్ వాళ్ళు పెట్టిన నిబంధన ప్రకారం గంటకి నూట ఇరవై మైళ్ళ స్పీడులో హైటెక్ బస్సు వెళ్తుంటే రోడ్డు పక్కనే ట్రైన్ ట్రాక్, దాని పక్కనే నీలంగా ఉన్న నీళ్ళ ప్రవాహంతో కాలవ. కాస్సేపటికి గాలి కంటే స్పీడుగా దూసుకుంటూ, వీళ్ల బస్సుని ఓవర్ టేక్ చేసుకుని వీళ్ళ పక్కనించెళ్ళిపోయింది ట్రైను.

వాళ్ళు వెళ్తున్న రోడ్డుకు పైన అడ్డంగా పెద్ద పెద్ద బ్రిడ్జీలు ప్రతీ అయిదు కిలోమీటర్లకి ఒకటయినా తగుల్తున్నాయి.

ఎడాపెడా పచ్చటి పంటలు, ఎడం పక్కన ఎత్తయిన పెద్ద గుట్ట మీద మూడు విండ్ మిల్స్ పక్క పక్కనే తిరుగుతూ కనిపించాయి. అక్కడక్కడా కనిపించే పాతకాలం నాటి ఇళ్ళు “A” అనే అక్షరం సాగదీసినట్టున్నాయి. వాటిపైన పొగ గొట్టాలు, గోడలకి పాకించిన పచ్చటి తీగలు పూర్వ వైభవం ఏ మాత్రం పాడవకుండా మెయింటేన్ చేసుకుంటూ వస్తున్నారక్కడి ప్రజలు.తమాషాగా ఉన్నది ఏది కనిపించినా వెంటనే వెనక్కి తిరిగి చూస్తున్నాడు జీవన్. నల్లటి బురఖా వెనక షహనాజ్ కళ్ళు కూడా వాటిని చూస్తున్నట్టుగానే ఉన్నాయి.

ముంచెన్ సిటీ వచ్చింది.

పొడుగాటి టన్నెల్లోంచి దారి. పగలే వెన్నెల్లా సోడియం దీపాల్తో నిండిపోయిందా దారి. ఈ టన్నెలేముందీ ఆస్ట్రియాలో ఆకేన్సీ లేక్ వేపెళ్తే పద్నాలుగు కిలోమీటర్ల పొడుగున్న టన్నెల్ ఉంది. అలా హైటెక్ బస్సు టన్నెల్స్ లో కెళ్ళినప్పుడు వెనకనించి ముద్దులు పెడ్తున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. దాదాపు కిలోమీటరు తర్వాత వెనక్కి తిరిగి చూస్తే హరిప్రియ, అనిల్. యూనిట్ లో వాళ్ళిద్దరి గురించి బాగా వినిపిస్తున్నాయి. దారిలో మూడు టన్నెల్స్ తగిలాయి. హైటెక్ బస్సు చీకట్లో కెళ్ళిన ప్రతీసారి ఈ ముద్దుల శబ్దాలు ఎక్కువయ్యాయి. పోను పోనూ మూలుగుల దాకా వెళ్ళింది వ్యవహారం.

ముంచెన్ సిటీ చాలా అందంగా ఉంది. పది ఫోర్ల మెర్సిడెస్ బెంజ్ షోరూమ్ గుండ్రటి భవనంలా కనిపించింది. ఆ పది ఫోర్లూ కార్లతో నిండిపోయి ఉన్నాయి. భవనం చుట్టూ ఎటు తిరిగి చూసినా మెర్సిడెస్ బెంజ్ కార్లే కనిపిస్తాయి. ఆ తర్వాత పాత భవనాల్ని ఎంతో పదిలంగా దాచుకునే వాళ్ళు కట్టుకునే మోడ్రన్ భవనాలు చాలా వింతగా ఉన్నాయి. ముఖ్యంగా వాటి కలర్ కాంబినేషన్ ఇండియాలో మనమెక్కడా చూడం అలాంటి రంగుల కలయిక.

బస్సు గ్యాస్ స్టేషన్ దగ్గరాగింది. బంక్ నానుకునే చిన్న సూపర్ బజారుంది. అంతా అందులోకీ, దాని పక్కనే మెక్ డొనాల్డ్ బర్గర్ షాపులోకీ దూరారు. జీవన్ కూడా రెండు బర్గర్లు కొన్నాడు. ఎక్కడ బడితే అక్కడ మనం యూరిన్ రిలీజ్ చెయ్యగూడదు. కాబట్టి గ్యాస్ స్టేషన్ దగ్గరున్న లెట్రిన్ లోపలికెళ్ళాలంటే ఒక యూరో కాయిన్ వేస్తే తప్ప డోర్లు తెరుచుకోవు. లోపలికెళ్ళిన జీవన్ కి రకరకాల కండోమ్స్ కనిపించాయి. యూరప్ లో సెక్స్ ఎక్కడన్నా చెయ్యొచ్చుగాబట్టి ఈ లెట్రిన్స్ లో కండోమ్స్ కొనుక్కుని లెట్రిన్ డోర్స్ లోకి దూరిపోవచ్చు. లెట్రిన్ లోకెళ్ళాడు జీవన్. పక్క దాంట్లోంచి ఒక అమ్మాయి అబ్బాయి ల మూలుగులూ కేకలూ వినిపిస్తున్నాయి. జీవన్ బయటికొచ్చే సరికి ఆ జంట కూడా బయటికొచ్చి సిగరెట్లు కాల్చుకుంటూ వెళ్ళి కార్లో వెళ్ళిపోయారు.

బస్సు లోపలికొచ్చే సరికి ఇంకా ఎవరూ ఎక్కలేదు.వెనక సీట్లో ఉన్న షహనాజ్ పుస్తకం చదువుకుంటుంది. జీవన్ దగ్గరున్న చికెన్ బర్గర్ ఆమెకిస్తే సైలెంట్ గా తీసుకుని "థాంక్స్" అంది. చాలా గొప్ప వాయిస్. మధుమతి సినిమాలో వైజయంతి మాల గొంతు, పాకీజా సినిమాలో మీనా కుమారి గొంతూ, నిర్దోషి సినిమాలో సావిత్రి గొంతు కలగలిసి వినిపించాయి.

షహనాజ్ తో పాటు ఊహల్లోకెళ్ళిపోతున్నాడు జీవన్. గొంతే అంత బాగుంది కదా, మరి రూపం ఎంత బాగుంటుందో అని ఊహిస్తున్నాడు. ఆపిల్స్ విరగ్గాసిన చెట్టు.

ఒక కొమ్మ మీద కూర్చున్న షహనాజ్ భీం ప్లాసీ రాగం వాయిస్తుంది. ఆమెనంటుకుపోయి కూర్చున్న తను వింటున్నాడు.అసలే పెద్దదైన ఆ రాగంతో ఎంతసేపు ఎంత చాకిరీ చేయించుకుందో షహనాజ్.అసలే తియ్యనైన ఆ రాగం షహనాజ్ చేతిలో మరింత తియ్యనిదైపోవడంతో తను ఆరగించడం మొదలెట్టాడు దాన్ని.

కదిలిన బస్సు కాస్సేపటికి జర్మనీ నించి ఆస్ట్రియా దేశంలోకి అడుగు పెట్టింది.దూరంగా చిన్న గ్రామం ఒకటి కనిపించింది. ఎలిఫెంట్ గ్రే కలర్ వేసున్న ఇళ్ళ పెంకుల మీద పచ్చగా నాచు పట్టేసి ఉంది. గోడలకి తెలుపు రంగు వేసుంది. అందమైన ఆ ఊరి మధ్యలో పాత కాలం నాటి చర్చి. ఊరి వెనక పచ్చటి కొండల మీంచి ఒకటి ఏకాంతంగా కనిపించింది. జనం ఎక్కడా కనిపించడం లేదు. రోడ్డుకి మరో పక్క చూస్తే వేల ఎకరాల మైదానంలో గడ్డి మేస్తున్న బలమైన బ్రౌన్ కలర్ గుర్రాలు, దూరం దూరంగా వర్షాకాలంలో ఎండిన గడ్డి దాచుకునే షెడ్లు కనిపించాయి.ముఖం ముందు వేలాడ్తున్న పరదా లోపలి అందమైన నోట్లోకి బర్గర్ పంపిస్తూ కిటికీ అద్దంలోంచి ఆస్ట్రియా అందాల్ని చుస్తుంది షహనాజ్.

బస్సు ఘాట్ రోడ్ ఎక్కింది. ఎత్తయిన ఆ ప్రదేశం కింద అగాధంలో జిర్ల్ అనే గ్రామం కనిపించింది. అది దాటాక మళ్ళీ టన్నెల్ వచ్చింది. వెనక మొదలైన ముద్దులూ మూలుగులూ బస్సులో అందరికీ వినిపించేంత ఎక్కువగా సౌండ్ లో వినిపిస్తున్నాయి.

వెలుగొచ్చాక చూస్తే... యోగి, బస్సు డ్రైవర్ హాన్సీ దగ్గరున్న మైక్ తీసుకుని వెనక సీట్లోంచి వాళ్ళ మధ్యలో పెట్టాడు. వెలుగొచ్చాక షహనాజ్ తో సైతం బస్సులో అంతా చప్పట్లు కొట్టే సరికి, సిగ్గు పడుతూ తలొంచేసుకుంది హరిప్రియ. అనిల్ అయితే చిరాగ్గా చూశాడు యోగి వంక.పెద్ద లోయలోకి దిగే సరికి వెడల్పాటి రెండు దార్లు కనిపించాయి. బస్సు ని ఎడం పక్క దారిలోకి తిప్పి ఒక కొండెక్కించి దింపితే... ఏగ్జమ్స్ అనే చిన్న గ్రామం వచ్చింది. దాని మధ్యలో ఉన్న న్యూవిర్ట్ అనే హోటలు ముందాగగానే "మరి దిగండి" అన్నాడు జార్జి ప్రసాద్.

ఆ చిన్న గ్రామంలో అదో చిన్న హోటలు. కానీ, స్టార్ హోటల్ రేంజ్ లో ఉంది వాతావరణం. రిసెప్షన్ దగ్గర కెళ్ళిన జార్జి ప్రసాద్ రిజిస్టర్లో పేర్లు రాయించి తాళాలు తీసుకునే పన్లో ఉండగా ఇద్దరు అందమైన అమ్మాయిలు సిగరెట్లు కాలుస్తూ మమ్మల్ని క్రాస్ చేసుకుంటూ వెళ్ళారు. వాళ్ళు లెస్బియన్స్. జిల్లర్ తల్బాన్ నుంచి ఎంజాయ్ చెయ్యడానికి ఈ ఊరొచ్చారట.

మాతో పాటూ జార్జి ప్రసాద్ ఇచ్చే తాళాల కోసం సైలెంట్ గా వెయిట్ చేస్తున్న కో – డైరెక్టర్ గంగరాజు హఠాత్తుగా లేచి ఒక్కొక్కళ్ళని అడుక్కుంటుంటే... తన దగ్గరున్న కట్ డ్రాయర్లలో ఒకటిచ్చాడు చందర్రావు.

కెమెరామెన్ వినాయకన్ ఫ్యాంటు, డాన్స్ మేస్టర్ టీషర్టూ ఇచ్చారు. యోగి పాత బ్రష్ ఇచ్చాడు. డైరెక్టర్ వేగేష్ బాగా పొదుపు, దానికి తోడు బాగా పిసినిగొట్టులాగున్నాడు. "నా దగ్గరేంలేదు, సరిపడా తెచ్చుకున్నాను" అన్నాడు.

"రేపు నా సూట్ కేస్ రాగానే ఇచ్చేస్తాను సార్" అన్నాడు గంగరాజు.

"అంటే, నువ్వు వాడింది మళ్ళీ నేను వాడనా..?" చిరాకు పడ్డాడు వేగేష్.

"అరెరే.., దార్లో వేప పుల్ల విరవడం మర్చిపోయేనే" అని చందర్రావు అంటుండగా తాళాలు తీసుకొచ్చిన జార్జి ప్రసాద్ అందరికీ

పంచుతున్నాడు.జీవన్, యోగికి ఒక రూమిచ్చారు. దాని నంబర్ 310.

అక్టోబర్ – 3

రాత్రయింది.

కొండల మీంచి వీస్తున్న చలిగాలి.

యూనిట్లో అంతా తాగే పనిలో ఉన్నారు. ఈ చలిలో ఎంత తాగినా ఎక్కడం లేదు. ఆ షహనాజ్ ఏం చేస్తుందో వెళ్ళి పలకరిద్దామా..? అనిపించింది జీవన్ కి.

యూనిట్ తో పాటూ స్టాంపింగ్ కోసం వచ్చిన సందీప్, ప్రణయ్ అనే ఇద్దరు కుర్రాళ్ళు అందరి రూములకీ వచ్చి "రూముల్లో భోజనం ఎలవ్ చెయ్యరంట సార్. హోటలు బయటున్న డైనింగ్ హాలు దగ్గర కొచ్చేయ్యండి తొరగా" అనెళ్ళిపోయాడు.

మందులో ఊగిపోతా అంతా తింటున్నారు. ఒక మూల షహనాజ్ తింటుంది. యూనిట్ తో పాటు వచ్చిన వంట కుర్రోడు రాము పచ్చి పులుసూ, బంగాళాదుంపల కూరా చికెనూ వండాడు. అందరి భోజనాలయ్యాక వంటోడు సర్దుకుంటుంటే ఆ టైములో దిగారు హరిప్రియ, అనిల్ కుమార్. స్పీడుగా వాళ్ళ దగ్గరకెళ్ళిన జార్జి ప్రసాద్ "రేపట్నుంచి ఇంత ఆలస్యమైతే పుడ్డుండదు. ఎన్ని సార్లు మీ తలుపు కొట్టాలి..?" అని కేకలేశాడు.

"పేకాడుకుంటున్నాం" అన్నాడు అనిల్.

"ఏవాడుకుంటున్నారో మాకు తెల్సులేరా..!" అని తిట్టేశాడు జార్జి ప్రసాద్.

రూమ్ లోకొచ్చాక “చలికి తట్టుకోలేక పోతున్నా సార్” అని నెపోలియన్ బాటిల్ మళ్ళీ తీసి తాగడం మొదలెట్టిన యోగి ఈ మధ్య మైసూరు టూరు వెళ్ళినప్పుడు తను కంపోజ్ చేసిన పాటలు వినిపిస్తున్నాడు.

అంతలో..,

వయోలిన్ నాదం. మొజార్ట్ సి మేజర్లో రాసిన వయోలిన్ కాన్ సెర్ట్ కెవి 373 లో చిన్న పీస్ వినిపిస్తుంది. అంటే షహనాజ్ ఉండేది ఎదురు గదిలోనేనా....!? మొజార్ట్ అంటే తనకూ చాలా ఇష్టమున్నట్టుంది.

అది వినడం మొదలెట్టాకా పాడ్డం మానేసి “వెస్ట్రన్ కూడా తెల్సన్నమాట.... ఎంత బాగా వాయిస్తుంది సార్ మన ప్రొడ్యూసర్ గారి చెల్లెలు.... ఒప్పుకుంటే BGM వాయించమని అడగాలి” అన్నాడు.

“అడుగు గానీ, తాగేసున్నావ్ కాబట్టి ఇప్పుడొద్దు” అన్నాడు జీవన్.

“అలాగే” అని పడిపోయాడు యోగి. అంతలో వచ్చిన గంగరాజు ని చూసి నవ్వాగలేదు జీవన్ కి. కురస ఫ్యాంటూ, పరమ లూజు టీ షర్టూ, పాత బూట్లూ హోటల్ బయట దొరికిందట చిరిగిపోయిన హేట్. మొత్తానికి ఒక టైపు కమెడియన్ గెటప్ లో ఉన్నాడు.

పడిపోయిన యోగి, స్ప్రింగులా లేచి గంగరాజు గెటప్ చూసి తెగ నవ్వుతూ “చాలా బాగుంది” అన్నాడు.“థాంక్స్ గానీ, చెప్పాను కదా నా కరెన్సీ అంతా సూట్ కేసులో ఉండిపోయింది. మీరేవన్నా ఇస్తే కాస్సేపు కిందనున్న బార్లో కెళ్తాను” అంటూ అక్కడున్న వేర్ హౌస్ స్క్రాచ్ కేసి చూసి వెళ్ళి దాన్నందుకుంటూ “ఇది ఉండగా ఇక బారెందుకు నాకు..?” అంటూ ఆ సీసా పట్టుకెళ్ళిపోయాడు.

షహనాజ్ గదిలో నుంచి వయోలిన్ వినిపిస్తుంది. మొజార్ట్ దే ఇంకో చిన్న పీస్ వాయిస్తోంది. అంతటి చలిలో కూడా గుండెల్లో ఎక్కడో చిన్న మంట రగులుకుని నులివెచ్చని అనుభూతిలో ఒళ్ళంతా మత్తెక్కింది జీవన్ కి.

మొజార్టే ఎదురు గదిలో కూర్చుని వాయిస్తున్నట్టుంది. గదిలోకి వెళ్ళి పలకరించి, ఆ రాత్రంతా షహనాజ్ వయోలిన్ వాయిస్తుంటే

తన్మయత్వంలో చూస్తూ ఉండిపోవాలనిపించింది జీవన్ కి.

గది వరకూ వెళ్ళి పలకరించకుండానే తిరిగొచ్చేశాడు జీవన్. షహనాజ్ నన్ను ఎందుకిలా వెంటాడుతూ ఉంది...? ఆలాపన లాంటి ఆమె ప్రేమ కదా...? హృదయాన్ని పరిమళింపచేసే ఆమె వయోలిన్నా...? ఉల్కాపాతాల్ని వర్షించే ఆమె కళ్ళా...? ఏమో తెలీదు అనుకుంటున్నాడు జీవన్.

అక్టోబర్ – 4

తెల్లారింది.

ఎవరూ లేపకపోయే సరికి ఆలస్యంగా లేచాడు జీవన్. పక్క బెడ్ మీద పెద్దగా గురక పెడ్తూ మ్యూజిక్ డైరెక్టర్ యోగి. వాడ్ని లేపడానికి ప్రయత్నాలు చేసి ఇక తన వల్ల గాక బాత్రూమ్ లో కెళ్ళొచ్చి ముఖం తుడుచుకుంటున్నాడు జీవన్.

అంతలో డోర్ సౌండొస్తే వెళ్ళి తీసేడు.

మేకప్ మేన్ సతీష్ "బ్రేక్ ఫాస్ట్ రడీ అంట సార్. రాత్రి మనం భోజనం చేసిన హాల్లోనేనండి" అన్నాడు.

కింద కెళ్ళేసరికి హోటలు వాడు ప్రొవైడ్ చేసిన కార్న్ ఫ్లెక్సూ, జాములూ, ఆరెంజ్ పళ్ళు, వంటోడు రాము చేసిన ఎగ్ డస్టూ తప్ప తక్కిన గిన్నెలన్నీ ఖాళీగా ఉన్నాయి. ఉన్నవాటితో సర్దుకుందామని బ్రెడ్ కి జామ్ రాసుకుంటూ అప్పుడు గమనించాడు జీవన్. షహనాజ్ ఒక్కతే కూర్చుని టీ తాగుతుంది. జీవన్ ని చూసింది.

"హాయ్...!" అన్నట్టు చేత్తో సైగ చేశాడు.

రెస్పాండవ్వకుండా నవ్వి ఊరుకున్నాయి ఆ కళ్ళు.

ఇదంతా గమనిస్తున్న యోగి “ఏంటి సార్, ఆ అమ్మాయిని పరిచయం చేసుకోడానికి ట్రై చేస్తున్నారా..?” అన్నాడు జామ్ రాసుకున్న బ్రెడ్ ని నోట్లో కుక్కుకుంటూ.

“ఆ అమ్మాయి ఎప్పుడో నాకు పరిచయమైంది. జార్జి ప్రసాద్ తో సలీం వాళ్ళింటికి వెళ్ళినప్పుడు చూశాను” అన్నాడు జీవన్.“హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి చూస్తున్నాను, మీ కళ్ళు ఆ అమ్మాయినే వెంటాడుతున్నాయి. ఎందుకు సార్ ఆ అమ్మాయి అంటే అంత ఇంట్రస్ట్..?” అన్నాడు యోగి.

“నేను కాదు, ఉల్కాపాతాల్ని వర్షించే ఆ అమ్మాయి కళ్ళే నన్ను వెంటాడుతున్నాయి” అన్నాడు జీవన్.

“ఉల్కాపాతాల్ని వర్షించే కళ్ళు అంటే..?” అన్నాడు అర్థం కాక యోగి.

“ఉల్కలు రాలిపోతూ దివ్యమైన కాంతిని వెదజల్లుతాయి. ఆ కాంతిలో మెరుస్తున్నాయి ఆమె కళ్ళు” అన్నాడు జీవన్.

టీ తాగి షహనాజ్ వెళ్ళిపోయింది. ఆమెని క్రాస్ చేసుకుంటూ ఆ అనిల్, హరిప్రియ ఒకళ్ళనొకళ్ళు అంటుకుపోయి మరీ దిగారు.“వీళ్ళ వాలకం చూస్తుంటే ఏదో గందరగోళం అయ్యేలాగుంది సార్” అన్నాడు యోగి.

మాట్లడలేదు జీవన్.

“ఇతన్ని నేను పెళ్ళి చేసుకుంటాను అని ఆ అమ్మాయి ఊహించుకుంటుంది. ఈవిడికి నేను కడుపు చేద్దామని వాడు ఊహించుకుంటున్నాడు. రెండిటిలో ఏది కరక్టంటారు...?”

“రెండోదే...”

వెనక్కి తిరిగి చూసేరిద్దరూ

లంగా లాంటిది కింద వేసుకుని, ఒక షర్టు పైన వేసుకుని నిలబడ్డాడు గంగరాజు.

“ఈ వేషమేంటి..?” అడిగేడు జీవన్.

“నా లగేజంకా రాలేదు సార్. ఎవర్నడిగినా మోతెక్కువవుద్ధని తక్కువ బట్టలు తెచ్చుకున్నాం అంటున్నారు...” అన్నాడు.

“మీ ఒంటి మీద బట్టలెవరివీ..?” అడిగేడు జీవన్.

“కాస్ట్యూమ్స్ బాక్స్ లోవి సార్” అన్నాడు.

“నెగిటివ్ మధ్యాహ్నం నించి రావొచ్చేట. మ్యూనిక్ నించి ప్రొడ్యూసరు సలిం, వేణు ఫోన్ చేశారట”

“అయితే ఇవాళ షూటింగ్ ఉండదేమో...!” అన్నాడు యోగి.

“మధ్యహ్నం నించి ఉండొచ్చట. జార్జి ప్రసాదు గారూ, డైరెక్టరూ, కెమెరామెన్నూ లొకేషన్సు చూడ్డానికెళ్ళేరు సార్” అనెళ్ళిపోయేడు.

బ్రేక్ ఫాస్ట్ అయ్యేకా జీవన్, యోగి న్యూవిర్ట్ హోటల్ దగ్గర్లో ఉన్న సూపర్ మార్కెట్లో కెళ్ళారు. పది యూరోలు ఖర్చు పెట్టి స్విడ్జ్ చెర్రీ ఫ్రూట్ బ్రాందీ, స్లిప్పర్లూ, వెనిగర్ లో ఊరబెట్టిన పచ్చిమిరపకాయల సీసా కొన్నాడు యోగి.

మధ్యాహ్నం మూడున్నర దాటింది. అంతా షూటింగ్ కెళ్ళిపోయాక కంపోజింగ్ మొదలెట్టాడు యోగి.

టేబుల్ మీద దరువేస్తూ ఏదేదో పాడుకుని కాస్సేపటికి పల్లవిలా ఫామ్ చేసుకుని అబద్ధ సాహిత్యం రాసుకుని పాడి “ఎలాగుంది సార్...?” అన్నాడు.

“ఇంకోటి చెయ్యి” అన్నాడు జీవన్.

“నా దగ్గర శీను అని ఒక కొత్త కుర్రాడు. వాడితో లిరిక్స్ రాయిద్దాం ఈసారి” అన్నాడు.

“అలాగే” అన్నాడు జీవన్.

“ఒక మంచి పల్లవి రాయండి ట్యూన్ చేస్తాను” అన్నాడు.

“ఆత్రేయ గారు రాసిన పల్లవి చెప్పనా..?” అంటే, “చెప్పండి” అన్నాడు.

చెప్పేముందు ఆ పాట ఆయన ఏ సిట్యుయేషన్ కి రాసేరో చెపుతాను విను... హీరోయిన్ జీవితంలో చాలా దెబ్బతింది. రకరకాల పరిస్థితులు ఆమెని చాలా బాధించాయి. దాంతో ఎక్కడా ఉండలేక క్లబ్బుకొచ్చి బాగా తాగేసి స్టేజి మీద పాడ్తుంది ఆ పాటేంటంటే...

తాగూ...

మనసైతే మధువుతాగు.

వీల్లేకుంటే విషం తాగు.

మధువు మత్తెక్కిస్తుంది.

విషం గట్టెక్కిస్తుంది.

బ్రాందీ విస్కీ రమ్మూ జిన్లూ రకరకాల పానియాలు.

అన్నా చెల్లి తల్లి దండ్రీ రకరకాల అనుబంధాలు.

ఏదైనా నిషా తీరే వరకే.

ఏవైనా రుణం తీరే వరకే.

నిషా తీరాకా ఖాళీ సీసాలు.

రుణం తీరాక కాలిన బూడిదలు.

అంతా విన్న యోగి "చాలా బాగుంది సార్. ఇలాంటి సాహిత్యం ఉంటే ఆ పాట ఎప్పటికీ బతికి ఉంటుంది" అని మళ్ళీ చేసిన పల్లవికి అబద్ధ సాహిత్యం పాడ్తున్నాడు. గంట సేపు పాట పాడిందే పాడ్తున్నాడు. అంతలో అతను కంపోజ్ చేసిన పల్లవి వయోలిన్ లో వినిపించింది ఎదురుగా ఉన్న షహనాజ్ గదిలోంచి. విన్న యోగి జీవన్ ని అడిగేడు "నేను కంపోజ్ చేసిన పల్లవిని ఆవిడెందుకు వయోలిన్ లో వాయించి వినిపించింది...?" తెలీదన్నాడు జీవన్.

"ఆవిడెందుకు వాయించేదంటే ఒరే ఎదవా అపశృతిలో పాడ్తున్నావ్ అని నాకు చెప్పడం కోసం" అన్నాడు యోగి.

"ఈ పాట చీకట్లో చిందులెయ్.... వెన్నెల్లో గంతులెయ్ అంత హిట్టవుద్ది సార్. ఇదే ట్యూన్ ఆ వయోలిన్ లోంచి వస్తుంటే నేను చేసేనని కాదుగానీ బాగుంది సార్" అంటున్నాడు.

ఇంకో ట్యూన్ చెయ్యమన్నాడు జీవన్.

“ఇంక ఇవ్వాళింతే సార్. ఒకోసారి మహదేవన్ గారు కూడా ఇంతేనట. ఆ వేళ ఆ ట్యూన్ డైరెక్టర్ కి నచ్చకపోతే రేపు కూచుందాం అని లేచిపోయేవారట” అన్నాడు.

“అంటే ఇవ్వాళ్టికి కంపోజ్ చెయ్యను అంటావ్...! అలాగే” అని వాడు కొనుక్కొచ్చిన చెర్రీ పళ్ళ బ్రాందీ ఓపెన్ చేసేడు జీవన్.

కార్యక్రమం మొదలైంది.

రాత్రి ఎనిమిదైనా చీకటి పడ్డంలేదు. చలి మాత్రం ధారుణంగా పెరిగిపోతుంది. షూటింగ్ కి వెళ్ళిన బస్ ఇంకా రాలేదు.

ఆంగ్లో ఇండియన్ రిథమ్ ప్లేయర్ ఆలెన్ వాళ్ళింట్లో తయారు చేసే గ్రేప్ వైన్ కంటే తియ్యగా ఉందీ స్విడ్జ్ బ్రాందీ. వచ్చేప్పుడు సూట్ కేసులో వేసిన తిరుమల రామచంద్ర గారి హంపీ నించి హరప్పాలో బసివి నాగమ్మ గురించి చదువుతున్న జీవన్ లేచి నిలబడ్డాడు.

ఈ ఊరొచ్చి అప్పుడే ఒక రోజు గడిచింది. డాక్టర్ అబూ, షహనాజ్ కి పెట్టిన 14 రోజుల గడువులో ఒకరోజు గడిచిపోయింది. ఆ వజీర్ ఏవన్నా సాక్ష్యం చూపించగలిగాడా అబూకి..! షహనాజ్ దగ్గరికెళ్ళి అడుగుదాం అనిపించింది జీవన్ కి. పరిచయం లేదు. ఒకవేళ ఉన్నా ఇలాంటి విషయాల గురించి మాటాడాలంటే చాలా చనువు ఉండాలి కదా..? అనుకున్నాడు.

అంతలో...

తలుపెవరో బాదుతున్న చప్పుడయితే వెళ్ళి తీసేడు యోగి.

కారప్పూస పొట్లం పట్టుకుని దిగిన గోవిందూ, చందర్రావు “జార్జి ప్రసాదు మీకిమ్మన్నాడు” అన్నారు జీవన్ తో.

“ఈ ఊళ్ళో కారప్పూస దొరుకుద్దా..?” అన్నాడు యోగి.

“కాదండి బాబూ, వచ్చేటప్పుడు మా రాజమండ్రిలో కొని తెచ్చాం” అన్నాడు చందర్రావు.

పొట్లం విప్ప ఓ గుప్పెడు నోట్లో వేసుకున్న యోగి “చాలా బాగుందండి చందర్రావు గారూ” అన్నాడు.

గర్వంగా చూసిన చందర్రావు మరి రాజమండ్రి అంటే ఏంటనుకుంటున్నారు..! అసలు మా రాజమండ్రి లో ఎన్ని లక్షలు ఫైనాన్సు వడ్డీకి తిప్పుతున్నారో తెల్సా..? తాపేశ్వరం మడత కాజాలు ఎప్పుడన్నా తిన్నావా ఆ పక్క...? విప్పనపాడు లో నాకెన్ని ఎకరాలు పల్లపు భూముందో తెల్సా..? చాగల్నాడులో నాటు కోడి మాంసం ఏం రుచండి బాబూ. మా బామ్మరిదికి ద్వారపూడి హోలుసేలు మార్కెట్లో రెండు షాపులున్నాయి తెల్సా నన్ను వాటా ఉండమన్నాడు. ఇలా లింకులు లేకుండా చందర్రావు మాటాడ్తుంటే బాధ తట్టుకోలేని యోగి బాటిల్లో చెర్రీ బ్రాందీ గడగడా తాగేస్తుంటే ఎవరో తోసేసినట్టు రూమ్ లో కొచ్చి పడ్డాడో మనిషి. చూస్తే గంగరాజు. పూర్వం విఠలాచార్య సినిమాల్లో కాంతారావు వేసుకునే జానపదం డ్రస్సులో నిలబడ్డాడు.

“ఏంటిది..?” అడిగేడు జీవన్.

“సెకండ్ హీరో సాంగ్ డ్రస్. ఇవ్వాల్టితో దీని వర్క్ అయిపోయిందిలేండీ” అన్నాడు.

అయిపోతే అయిపోయింది. నువ్వెందుకేసుకున్నావని..?" అనడంతో గొళ్ళుమని ఏడుస్తూ ఎమిరైట్స్ ఫ్లైట్ లో నెగెటివ్ వచ్చింది గానీ, నా సూట్ కేసింకా రాలేదు సార్. ఫ్రాంక్ ఫర్ట్ వెళ్ళిపోయిందట. బట్టల్లేక ఇలా చావాల్సి వస్తుంది మరి" అన్నాడు.

ఇలాంటి వెదవ్వేషాలేసే బదులు... ఈ పూళ్ళో కొనుక్కోవచ్చు గదా బట్టలు..?"

"ఒక జత మన కరెన్సీ ప్రకారం వేల మీదుంది సార్.... నాకంత శక్తి లేదు..." అన్నాడు.

“నిన్నీ వేషంలో చూసే శక్తి మాకు లేదు” అన్నాడు గోవిందు.

చూడలేకపోతే కళ్ళు ముసుకో, లేకపోతే ఏదో చేస్కో... సరే నేనొచ్చింది ఎందుకంటే “డిన్నర్ రెడీ అంట అొందరగా రమ్మంటున్నాడు వంటోడు” అనెళ్ళిపోయేడు.

డిన్నర్ కెళ్ళొచ్చాకా “పడుకుందాం” అంటే “కాదు పాట కంపోజ్ చేస్తాను” అని పల్లవిలో మూడు లైన్లు చేసి ఫినిషింగ్ లైను రాక అవస్థ పడుతూ చివరికి నిద్ర పోయాడు యోగి.

నిద్ర రావడం లేదు జీవన్ కి. అబూ పెట్టిన గడువులో రెండో రోజు కూడా పూర్తి కావస్తుంది.

ఏం జరగబోతుంది...?

అసలు షహనాజ్ ఏం ఆలోచిస్తుంది..? లోపల్లోపల ఎంత అవస్థ పడ్తుంది..?

అలా పరిపరి విధాల పోతుంది జీవన్ మనసు. అలా నానా అవస్థా పడుతూ ఎప్పటికో నిద్రపోయాడు జీవన్.

అక్టోబర్ – 5

ఆ మర్నాడు ఎదురుగుండా ఉన్న రూంలోంచి వినిపిస్తున్న షహనాజ్ వయోలిన్ కి నిద్రలేచారిద్దరూ. యోగి అసంపూర్ణంగా వదిలేసిన పల్లవిని పూర్తి చేసి వాయిస్తుంది షహనాజ్. “బలేగుంది సుమా” అనుకుంటుండగా చరణం కూడా వినిపించింది. ఆమె యాడ్ చేసిన లైన్స్ తో ట్యూన్ కలరు మొత్తం మారిపోయింది. అదేదో హిందూస్థానీ రాగం... పహాడీ అనుకుంటాను.

“చాలా బాగా కంపోజ్ చేసిందే, ఇదే వాడేసుకుందాం” అంటూ బయటికెళ్ళిన యోగి పది యూరోలు ఖర్చు పెట్టి డిప్ప క్రాపు లాంటిది చేయించుకొచ్చాడు. ముందు భాగం కొంత ఇనిస్ట్ రో బ్లీచ్ చేయించుకున్నాడు.

“ఎలాగుంది..?” అన్నాడు.

“నవ్వొచ్చేలాగున్నావ్” అని నవ్వేసిన జీవన్ కిందకెళ్తుంటే... “మీకో విషయం చెప్పాలి” అన్నాడు యోగి

“ఏంటి..?” అన్నాడు జీవన్.

“రాత్రి నిదట్లో ఊపిరి ఆడక చాలా అవస్థ పడ్డారు మీరు. చాలా భయమేసింది నాకు” అన్నాడు యోగి.

“నిజమే..... హైదరాబాదు వెళ్ళాకా ఎవరన్నా మంచి లంగ్ స్పెషలిస్ట్ దగ్గరకెళ్ళాలి” అంటుండగా కింద కొచ్చేసింది లిఫ్టు.

హోటల్ కి దగ్గర్లో ఉన్న జస్కెన్చ్ స్టుబెర్ట్ అనే షాపులో కెళ్ళారిద్దరూ. పర్ ఫ్యూమ్ డ్ కేండిల్సు కొంటూ కనిపించింది షహనాజ్. అంటే ఈ కొవ్వొత్తులు వెలిగిస్తే కాంతితో పాటు మంచి పరిమళాన్ని కూడా ఇస్తాయట.

దగ్గరగా వెళ్ళిన వాళ్ళిద్దరూ పరిచయం చేసుకుంటుంటే గమ్మత్తుగా నవ్వింది.

“పల్లవి చివర మీరు కంపోజ్ చేసిన లైను చాలా బాగుంది.... చరణం కూడా...” అన్నాడు.

ముసుగులోంచే నవ్వింది.

“మొత్తం ట్యూన్లు ఒకసారి ప్లే చేస్తే రికార్డ్ చేసుకుంటా” అన్నాడు.

“నిజంగా బాగుందా..?” ఆమె అడుగుతుంతే మళ్ళీ వైజయంతిమాలా, మీనా కుమారీ, సావిత్రీ గుర్తొచ్చారు జీవన్ కి.

“చాలా బాగుంది.... మీరు కంపోజరా...?” అడిగేడు యోగి.

“కాదు” ఆ షాపులోంచి బయటికొచ్చిన ఆమె ఎదురుగుండా ఉన్న బంటర్ లాడెన్ అనే ఇంకో షాపులోకెళ్ళింది.

ఫాలో అయ్యేరిద్దరూ.

స్టేషనరీ, రెడీమేడ్ రెండు కలిపి ఉన్న షాపు అది. వాటర్ కలర్సూ పెన్నులూ కొన్నాడు జీవన్.

“కంపోజర్ కాకండా అంత బాగా అంత మెచ్యుర్డ్ గా ఎలా కంపోజ్ చేసేరు..?” అడిగేడు యోగి.

“ముందు మీ మూడు లైన్లు గొప్పగా ఉండటంతో వాటికి మేచ్ అయ్యేలా ట్రై చేసేనంతే” అందామె.

“కంపోజింగ్ లో మీరు కూడా మాతో పాటు కూర్చుంటే ఇన్స్ పిరేషన్ గా వుంటుంది” అన్నాడు యోగి.

“నేనంత గొప్పదాన్ని కాదు. ఏదో సరదాగా వయోలిన్ నేర్చుకున్నాను” అందామె.

“సరదాగానే కూర్చోండి మాతో పాటు, రూమ్ లో ఒంటరిగా వుంటే మీకు బోర్ కొడుతుంది” అన్నాడు జీవన్.

మాట్లాడ్తూనే ఆమెతో స్పోర్ట్స్ స్టోర్ లోకీ ఫోటో షాపులోకీ తిరిగారిద్దరూ.

ఆమెతో పాటు తిరుగుతూ బాగా చనువు పెంచుకునే ప్రయత్నం చేసేడు జీవన్. ఎందుకంటే చనువు పెరిగితే ఏవయింది ఆ వజీర్ ఏవన్నా ప్రూవ్ చేశాడా అని అడగొచ్చు.

ఆ మధ్యాహ్నం వాళ్ళు కంపోజ్ చేస్తుంటే రూమ్ లోకొచ్చి సహకారం చేసింది.

ఆమె నీలి కళ్ళ మీద ఎండపొడ పడి మాయమవుతున్నట్టూ ఫీలయ్యాడు జీవన్.

భోజనం చేసి పడుకుని సాయంత్రం లేదారిద్దరూ.

మరి కూర్చుందామా..? అన్నాడు యోగితో...

"ఏం కూర్చోడం సార్... ఎప్పుడు చూసినా ఈ రూమ్ లో కూర్చుంటే అయిడియాలు రావడం లేదు. అలా బయట తిరిగొద్దాం పదండి" అన్నాడు.

"ఇప్పుడు టైమెంతయ్యింది..?" అడిగితే టీ.వీ మీద పెట్టిన వాచీ తీసి చూసుకుని చెప్పేడు "ఆరు" అని.

"అయితే మార్కెట్లో షాపులు క్లోజ్ చేసేస్తారు" అన్నాడు.

కిటికీ లోంచి బయటికి చూసేడు యోగి. మధ్యాహ్నం మూడు అనిపించేంత ఎండ ఉంది కొండల మీద. "నా టైము తప్పేమో సార్" అన్నాడు.

"లేదు రైటే. ఈ సీజన్లో ఇక్కడ రాత్రి ఎనిమిదిన్నర దాకా సూర్యుడుంటాడు. అదే శీతాకాలంలో అయితే రోజుకి ఆరు గంటలు మాత్రమే వెలుగుంటుంది" అన్నాడు జీవన్.

"అయినా నాకు చాలా చిరాగ్గా ఉంది. కాస్సేపు అలా రోడ్ల మీద తిరిగొద్దాం రెడీ అవ్వండి" అనేసి బాత్ రూంలోకెళ్ళాడు.

అతను మేకప్పూ అదీ చేసుకు రావడానికి కనీసం అరగంట పడ్తుంది. పాంటు వేసుకుని శాలువా కప్పుకుని కిందికి దిగేడు జీవన్.

రిసెప్షన్లో కంప్యూటర్ ముందు కూర్చున్న వేణుగారు పలకరించేరు.

“షూటింగయిపోయిందా.... అంతా వచ్చేసారా...?” అడిగేడు జీవన్.

“లేదండీ... నాకు మెయిల్స్ చెక్ చేసుకునే పని ఉండే వచ్చాను” అన్నాడు.

“నా సైట్ ఓపెన్ చెయ్యండి” అన్నాడు జీవన్.

“అడ్రస్..?” అన్నాడు.

“ఫిల్మ్ డైరెక్టర్ జీవన్ డాట్ నెట్” అన్నాడు జీవన్.

చాలా ఫాస్ట్ గా ఓపెనయింది. జీవన్ ఫస్ట్ ఫిల్మ్ నించి ఫోటోలూ, జీవన్ మీద ఆర్టికల్సూ, ఫిల్మోగ్రఫీ, మిత్రులు రాసిన ఆర్టికల్సూ, వేరే దేశం... వాటన్నిటినీ చూసుకుంటుంటే చాలా సంబరంగా ఉంది జీవన్ కి.

“ఎవరు మెయింటైన్ చేస్తున్నారు ఈ సైట్ ని..?” అడిగేడు వేణు.

“అమెరికా లో ఉండే నా మిత్రులు” చెప్పేడు జీవన్.

అంతలో బాగా తయారయిన యోగి దిగేడు.

పబ్ లో అమ్మాయిలూ అబ్బాయిలూ మిడిల్ ఏజ్ వాళ్ళు ముసలాళ్ళు తాగుతా, సిగరెట్లు కాలుస్తా కనిపిస్తున్నారు అద్దాల్లోంచి. అంతలో హోటల్ని ఆన్చి ఉన్న చర్చి పక్కలోంచి వచ్చిన ఒక అందమైన అమ్మాయి పబ్ లోకెళ్ళి పోయింది.

“ఏంటండీ బొత్తిగా అర్థం గావటం లేదు వీళ్ళ గొడవ” అన్నాడు వేణుతో...

“లోపలికెళదాం రండి చూద్దురు గానీ...” అన్నాడు.

“వద్దులెండి ఇవాళ్టినించి తాగకూడదు అనుకుంటున్నాను” అన్నాడు జీవన్.

“మేం తాగుతుంటాం, మీరు మంచి నీళ్ళు తాగుదురు గానీ రండి” అనే సరికి వేణు కూడా లోపలికెళ్ళారిద్దరూ. తిని తాగి సిగరెట్లు కాల్చుకుంటూ వెళ్ళిపోతున్న అమ్మాయిలూ ముగ్గురు ఎవరి బిల్లూ వాళ్ళే ఇచ్చుకుంటున్నారు. “అదేంటి..?” అని వేణునడిగితే “ఇంతే ఇక్కడ పద్ధతి. ఆ ముగ్గురి బుల్లు పొరపాటున ఒక్కరు ఇవ్వడం జరిగితే అది చాలా గొప్ప వీళ్ళకి” అన్నాడు.

స్టీవర్డ్ వచ్చింది. రెండు గ్లాసులు రాడ్లర్ బీరూ ఒక గ్లాసుడు టాప్ వాటరు ఆర్డరు చేసేడు వేణు.“ఇంకా చెప్పండి వీళ్ళ గురించి...” అన్నాడు జీవన్.

“వీళ్ళలో ఎవరైనా మినిమమ్ టెన్త్ క్లాస్ చదవాలి. ఆ చదివేప్పుడే ఎవడి ఫ్యూచర్ గురించి వాడు ఆలోచించుకుంటారు. ఆ టెన్త్ అయ్యాకా ట్రక్కు నడుపుకోవాలని నిర్ణయించుకున్నవాడు దానికి సంబంధించిన చదువు, విమానం నడపాలని అనుకున్నవాడు దానికి సంబంధించిన చదువూ చదువుకుంటారు. యుక్త వయసు వచ్చాకా తల్లిదండ్రులు వాళ్ళనొదిలేస్తారు. మనలాగ సంబంధాలు చూడ్డమనేవి ఉండదు. వీళ్ళకి ఎవరికి తగ్గ మనిషిని వాళ్ళు సెలెక్ట్ చేసుకోవడమే” వేణు గారు అలా చెపుతుండగా బస్సొచ్చి ఆగింది. షూటింగ్ కెళ్ళిన జనమంతా దిగుతున్నారు.

హరిప్రియ, నాగరా ఆపరేటర్ని డైనింగ్ హాల్లోకి తీసుకెళ్ళి ప్రాక్టీసు చేయిస్తున్నాడు డాన్స్ మేష్టారు. అంతలో పరుగు పరుగున అక్కడి కొచ్చేసిన అనిల్ చాలు చాలు పొద్దుట్నుంచి చాలా అలిసిపోయింది అన్నాడు డాన్సు మేష్టారుతో.

"సెకండ్ బి.జి.ఎమ్ లో సరిగ్గా రావడం లేదు మూమెంట్సు" అన్నాడు డాన్స్ మేస్టరు.

"నిజమే.... ఇప్పుడు రిహార్సల్సు పెడితే మొత్తం డల్ అయిపోద్దిగదా రేపటికి...?" అని ఆపించేశాడు రిహార్సలు.బస్సు డ్రైవర్ ఉల్ఫ్ వచ్చి ఒక కాఫీ, ఒక బీరూ, ఒక జ్యూసూ ఆర్డర్ చేసి ఒకోటీ కొంచెం కొంచెం తాగుతున్నాడు.

"ఇదేంటండీ వీడికేవన్నా మెంటలా...?" అన్నాడు యోగి.

నవ్వేసిన వేణు "వీళ్ళ పద్ధతి ఇంతే. మీకింకో విషయం తెల్సా..? అతనప్పుడే డిన్నర్ చేసేసేడు. ఇక్కడికొస్తున్న వాళ్ళంతా డిన్నర్ తినేసి వస్తున్న వాళ్ళే. ఖాళీ కడుపుతో వీళ్ళు తాగరు. మనలాగ తాగి కొట్టుకోడాలు తూలుకుంటూ వెళ్తా ఏ రోడ్డు పక్కనో పడిపోవడాలూ చెయ్యరు" అన్నాడు.

"పొద్దుట ఆరు గంటల నుంచి తెరిచే ఉందే ఈ బారు...?" అంటే "అవును, పొద్దుట్నుంచి తాగుతుంటారు.... జర్మనీలో అయితే బీరు మంచి నీళ్ళలాగ తాగుతారు" అన్నాడు.

"అదేంటి...?" అన్నాడు జీవన్.

"అక్కడ ఒక సీసా మినరల్ వాటర్ రేటెంతో బీరు రేటూ అంతే" అన్నాడు వేణు.

పేపర్ స్టాండులో పెట్టి ఉన్న ఆరోజు న్యూస్ పేపర్ల మీద హాలీవుడ్ ఏక్టర్ చార్లెస్ బ్రాన్ సన్ ఫోటో వేసి ఉంది. దగ్గరకెళ్ళి పేపర్లన్నీ చూసేడు జీవన్. ప్రతి పేపరు ఫ్రంట్ పేజి మీద నిన్నటి తరం హీరో అయిన బ్రాన్ సన్ ఫోటోలే కనిపించాయి. ఆ పేపర్లన్నీ జర్మన్ లో ఉండటంతో ఉల్ఫ్ దగ్గరకి పట్టుకెళ్ళి అడిగితే... నిన్న అంటే ఆగస్టు 30 న న్యూమోనియాతో చనిపోయేడట బ్రాన్ సన్.

అయితే..,

అతను కుర్రాడేం కాదు, పోయే నాటికి అతని వయసు 81 సంవత్సరం. గన్స్ ఫర్ సాన్ సెబాస్టియన్, ఫ్రమ్ నూన్ టిల్ త్రీ, డెత్ విష్ లాంటి చిత్రాల్లో నటించిన నిన్నటి తరం యాక్షన్ హీరో బ్రాన్ సన్. విశేషమేంటంటే భార్యతో ఎక్కువ సినిమాల్లో నటించాడు బ్రాన్ సన్. అతని సినిమాల్లో ఒక మంచి సినిమా ఇటాలియన్ డైరెక్టర్ సెర్జియోలియోన్ తీసిన ఒన్స్ అపాన్ టైమ్ ఇన్ వెస్ట్.

రాత్రి ఎనిమిదిన్నర అయింది.

భోజనాలు చెయ్యడానికిచ్చిన హాలులోకి వెళ్ళారంతా. ఇవాళ పోర్కు, చికెన్, మన కోసం స్పెషల్ గా చేయించాను. నా కోసం తాగేయండి. మీకేవన్నా అయితే ఇన్స్ బ్రూక్ లో ఉన్న పెద్ద హాస్పిటల్ కి నేను తీసుకెళతాను. తప్పులేదు.... గడ్డ కట్టించే చలి, మన వాళ్ళంతా తాగుతున్నారు అన్నాడు వేణు.

జార్జి ప్రసాదు, జీవన్ కోసం రెండు లీటర్ల బకార్డీ తీసుకొచ్చేడు.

తాగడం మొదలెట్టారు.

కాస్సేపయ్యింది.

యూనిట్లో వాళ్ళు భోజనాలకి వస్తున్నారు. వేణు గారు ఫోన్ చేస్తే కెమెరామేనూ, డైరెక్టర్ వచ్చారు. ఆ వేళ వర్క్ ప్రోగ్రెస్ గురించి, కాస్సేపు జోకులూ కేకలూ అయ్యాక ప్రొడ్యూసరు సలీం వచ్చాడు. "మిమ్మల్ని కలవడమే కుదరడం లేదు. ఇన్స్ బ్రూక్ హోటల్లో పెట్టిన హీరో సందేష్ కి ఏం అవసరమో చూసుకోవడంతో గడిచిపోయింది రోజు. ఇక్కడ జార్జి ప్రసాదు మొత్తం తనదే అన్నట్టు చూసుకుంటున్నాడు గాబట్టి నేనలా తిరుతుతున్నాను" అని జీవన్ కి "సారీ" చెప్పి లార్జ్ పెగ్ పోసుకున్నాడు.

చలి బాగా ముదిరిపోయింది.

ఆల్మోస్ట్ ఒకళ్ళ నొకళ్ళు అంటుకుపోతూ ఒక జంట ఇటు వైపు వస్తుంది. ఈ ఆస్ట్రియన్స్ కి మరీ సిగ్గూ శరం లేదన్నాడు యోగి. తీరా చూస్తే ఆ వస్తున్న వాళ్ళు హరిప్రియ, అనిల్.

అందరికీ మందెక్కువయ్యింది.

ఆ రాత్రి భోజనం చెయ్యకుండానే రూమ్ కొచ్చాక ఫోన్ మోగింది. షహనాజ్ "ఒక టర్కీ కేసెట్ పంపిస్తున్నాను పనికొస్తే చూడండి. గుడ్ నైట్" అంది.

కాస్సేపయ్యాకా దోబీ చక్రం ఒక కేసెట్ ఇచ్చెళ్ళాడు.

చాలా సేపు విన్నాడు జీవన్. అన్నీ పేథటిక్ నెంబర్లు.

అక్టోబర్ – 6

మర్నాడు ప్రొద్దుట యోగి టెలిఫోను కార్డు కొనుక్కుని బేంక్ కెళ్ళి యూరోలు డ్రా చేసుకొస్తానని వెళ్ళాడు. షహనాజ్ కి ఫోన్ చేసి అదే చెప్పబోతుండగా ఒక విచిత్రమైన డ్రస్సులో దర్శనం ఇచ్చేడు గంగరాజు.

"ఇదేంటి...?" అన్నాడు జీవన్.



నిన్నటితో ఒక సాంగ్ అయిపోయిందండి. దాంట్లో హీరో గారి కాస్ట్యూమ్ ఇది. ఈ అద్దాల డ్రస్సు బాంబేలో కుట్టించడానికి లక్ష అయ్యింది ప్రొడ్యూసర్ కి" అన్నాడు.

"అలాగా..!" అన్నాడు జీవన్.

"నే వేసుకుంటే ఎలాగుంది..?" అడిగేడు.

"పరమ వరస్ట్ గా ఉంది" అప్పుడే వచ్చిన యోగి అలా చిరాకు పడ్డాడు.

“మరేం చెయ్యమంటారు సార్. నా సూట్ కేసు ఆ ఎమిరైట్స్ ఎయిర్ లైన్స్ వాళ్ళ దగ్గర్నించి రాలేదింకా” అన్నాడు.

“సరే ఇంపార్టెంట్ ఫోన్ మాటాడాలి. ఎందుకొచ్చేరో చెప్పండి”

“ఒక ఏభై యూరోలు కావాలి సార్” అన్నాడు. ఇచ్చి అతన్ని పంపించాకా ఆ రోజు అవకాశం దొరికినప్పుడల్లా ఆమెతో మాటాడేడు జీవన్.“సార్, మీరేవన్నా చెప్పండి గానీ ఈ నాలుగు గోడల మధ్యా కూర్చుని పని చెయ్యడం నా వల్ల గావడం లేదు. మొనాటనీ దాన్ని బ్రేక్ చెయ్యాలి”. ఆ ప్రొద్దుట వాళ్ళు ఉంటున్న రూమ్ కొచ్చిన జార్జి ప్రసాద్ తో ఆ విధంగా మొత్తుకోవడం మొదలెట్టాడు యోగి.

“అయితే ఏం చేద్దామంటారు షూటింగ్ స్పాట్ కెళదామా..?” అడిగాడు జార్జి ప్రసాద్.

“వద్దు వాళ్ళ షూటింగ్ కెళ్ళి పని పాడు చెయ్యడం ఇష్టం లేదు. ఎక్కడికయినా తీసుకెళ్ళండి” అన్నాడు యోగి.

“ఎక్కడికెళదాం..?”

“సాల్స్ బర్గ్ ఎంత దూరం..?” అడిగేడు జీవన్.

“ఇన్స్ బ్రూక్ వెళ్ళి ట్రైనెక్కితే రెండు గంటలు జర్నీ” అన్నాడు తన రూమ్ లో కెళ్ళబోతూ ఆగిన జాస్తి చౌదరి.

“సాల్స్ బర్గ్ లో ఏముంటది..?” అడిగేడు కన్నారావు గారనే ఆయన.

“మొజార్ట్ ప్లేస్ అది” అన్నాడు జీవన్.

“అయితే అక్కడికెళదాం” అన్నాడు యోగి.

వీళ్ళిద్దరితో పాటు చందర్రావు, గోవిందూ కూడా వస్తామన్నారు. మొత్తం ఆరుగురూ బస్టాప్ కొచ్చారు. కాస్సేపటికి స్కూలు పిల్లలూ, వయసులో పిల్లలూ పెద్దోళ్ళూ ముసలోళ్ళు బాగా మూగారు.

వెయిటింగ్.... కాస్సేపటికికొచ్చింది బస్సు. క్యూలో లోపలికెళ్ళారంతా.

డ్రైవరూ కండక్టరూ ఒకడే. ఆరుగురికీ ముప్పై తొమ్మిది యూరోలు తీసుకుని టికెట్లిచ్చాడు. ఏగ్జమ్స్ నించి ఘాట్ రోడ్ మీదుగా ఏడు కిలోమీటర్లు ప్రయాణం. బస్సులో కూర్చున్న అందరి విసుగూ మాయమయిపోయింది. అంత బాగుంది బస్సు. వెచ్చగా హాయిగా ఉంది లోపల. చిన్న చిన్న గ్రామాల్లో కూడా టయోటా, బెంజ్, రోల్స్ రాయిస్ షోరూమ్స్ ఉన్నాయి.

ఘాట్ రోడ్ లోంచి కొండ మీదున్న అడివి వేపు చూస్తే నల్లటి బట్టల్లో కొండపై వెళ్తున్న అమ్మాయిని వెనక నించి చూస్తే షహనాజేనేమో అన్న భయం కలిగింది.

ఇన్స్ బ్రూక్ బస్ టెర్మినల్ ఆనుకునే ఉంది రైల్వే స్టేషన్.

ఇన్ఫో కౌంటర్ కెళ్ళి అడిగితే టైన్ ఒంటి గంటన్నరకి అని తెల్సింది. అప్పుడు టైం పదకొండున్నర ఇంకా రెండు గంటలుంది. ఏం చెద్దాం అనుకుంటుంటే చెయ్యడానికి బోలెడంత ఉంది అని సిటీ లోపలికి నడిచేడు జాస్తి చౌదరి. వెనక మేం.

ఒక విగ్స్ తయారు చేసే షాపు ముందాగేం.

జార్జి ప్రసాద్ బట్టతల చూపించి ఇతనికి సూటయ్యే మంచి విగ్ కావాలన్నాడు.

తనతో రమ్మంది.

లోపల హెయిర్ కటింగ్ సెలూన్ల టైపులో పెద్ద పెద్ద అద్దాలు వాటి చుట్టూ లైట్లు, అద్దాల ముందు కుర్చీలూ ఉన్నాయి. ఒక కుర్చీలో జార్జి ప్రసాదుని కూర్చోపెట్టిన ఆమె విగ్గొకటి తీసుకొచ్చి అతని తల మీద పెట్టింది.

చూస్తే...

విగ్గు పెట్టినట్టే లేదు. తన వీడియో కెమెరాతో షూట్ చేసేడు యోగి. మన కరెన్సీతో చూసుకుంటే ఏభై వేలట. ఇంకో లేడీ వచ్చి కొలతలు తీసుకుని పర్ ఫెక్ట్ సైజ్ లో చేస్తాం రేపు అని ఫలానా టైముకి అని అపాయింట్ మెంటిచ్చింది.

అక్కడ్నించి బయటికొస్తుంటే "విగ్గు లేకండా జుట్టు మొలిపించడానికి ఎంత తీసుకుంటారు..?" అనడిగాడు గోవిందు.

"రూపాయి పావళా.., మీరెవరు మాటాడకుండా మమ్మల్ని ఫాలో అవ్వండి" అన్నాడు జార్జి ప్రసాద్.

ఆరేడు ఫోర్లున్న ఆ పెద్ద భవనం పేరు హిల్టన్ బిల్డింగ్. అందులోనే సిక్త్ ఫ్లోర్ లో ఉన్న హోటల్ హిల్టన్ లో ఉంటున్నాడు మెయిన్ హీరో సందేశ్. బిల్డింగ్ కింద రకరకాల షోరూమ్స్. ఒక చోట కేవలం లెదర్ తో చేసిన జాకెట్లూ, షెర్లాక్ హోమ్స్ లాంగ్ కోట్లూ, హేట్లూ ఉన్నాయి. ఆ రేట్లు చూస్తుంటే మతి పోయింది. పక్కనే ఆప్టికల్ షోరూం దానికెదురుగా షాపు. మోడ్రన్ వాచిల దగ్గర్నుంచి ఏంటిక్స్ దాకా ఉన్నాయక్కడ. వీటిని ఆన్చి కేబరే. అక్కడ్నించి పక్కకెళితే అయిదు ఫోర్ల పెద్ద బిల్డింగ్. లోపల కెసినో ఉంది. దాన్ని ఆస్ట్రియా గవర్నమెంటు నడుపుతుందట.జాస్తి చౌదరి తో పాటు లోపలికెళ్ళారంతా.

అసలు కెసినో పైనుందట. సాయంత్రం మూడున్నర తర్వాత ఓపెనవుతుంది అది. లోపలికెళ్ళారంతా. రకరకాల మిషన్ల ముందు జూదం ఆడుతూ జనం. వాళ్ళలో ఎక్కువగా ముసలివాళ్ళే ఉన్నారు. ఈ గ్రౌండ్ ఫోర్లో ఉన్న మెషిన్లన్నీ వాళ్ళ కాలక్షేపం కోసమట. మెగా సెవెన్ అనే మిషిన్ ముందు కూర్చుని అయిదు యూరోల నోటుని మెషిన్లోకి తోసి ఆట మొదలెట్టిన యోగికి వెంటనే ఏభై, అక్కడ్నించి వంద వచ్చాయి. "బిగినర్స్ లక్ ఆహా" అన్నారంతా. హుషారు పెంచిన యోగి ఒక అరగంట సేపు ఆడి ఇరవై యూరోలు పోగొట్టుకున్నాడు.

గుడ్ లక్ అనే మిషిన్ ముందు కూర్చుని జూదం ఆడ్డంలో పడిపోయిన జాస్తి చౌదరి "ట్రైన్ టైమవుతుంది వెళ్ళండి" అన్నాడు.

“అదేంటి నువ్వు రావా..?” అంటే, “ఇంతకు ముందు రెండు సార్లు వెళ్ళాను. నేనిక్కడే ఉంటాను మీరెళ్ళి వచ్చేయ్యండి..” అన్నాడు.ఇక మిగిలింది అయిదుగురు.

మళ్ళీ ఇస్తానని జీవన్ దగ్గర్నుంచి ఒక యాభై యూరోలు తీసుకున్న జార్జి ప్రసాద్, టిక్కెట్లు కొని దార్లో తినడానికి చికెన్ రోల్స్ కొన్నాక ప్లాట్ ఫారం మీద కొచ్చారంతా.

ఆ రైల్వే స్టేషన్లు అలిగి ముగ్గెట్టిన కోనసీమ గ్రామంలో మూడు మండువాల లోగిలిలా ఉంది. జన సంచారం తక్కువ. ఎలాంటి సౌండ్ పొల్యూషనూ లేదు.

కరెక్ట్ గా ఒంటి గంటన్నర అంటే ఒంటి గంటన్నరకి వచ్చి ఆగింది సాల్స్ బర్గ్ ట్రైను.

కిటికీ దగ్గర సీటు దొరికింది జీవన్ కి. అతని పక్కనే యోగి. ఎదురుగా జార్జి ప్రసాద్, కాస్త దూరంగా చందర్రావు, గోవిందు కూర్చున్నారు.స్పీడందుకుంది రైలు. మైదానాల్లో దూరం దూరంగా ఇళ్ళు. ఏ ఇంటికీ కాంపౌండ్ వాల్ లేదు. చాలా ఇళ్ళ ముందు ఏపిల్ చెట్టున్నాయి. ప్రతీ చెట్టుకీ విరగ్గాసి ఉన్న ఏపిల్స్ ని చూస్తుంటే ఇంకా చూడ బుద్ధేసింది. వాటిని చూసి చాలా ముచ్చటపడిపోయిన గోవిందు “మన ఇళ్ళ ముందు జామ చెట్లు లాగా ఏంటి ఏప్లీసు చెట్టు” అన్నాడు. కొన్ని చోట్ల రైలు ట్రాక్ పక్కన కేబేజి పంట. కొన్ని లక్షల కేబేజి పువ్వుల్ని ఒక చోట చూస్తున్న జీవన్ అలాంటి విజువల్ చూడ్డం ఫస్ట్ టైమ్ గాబట్టి అదోలాగయిపోయేడు. వెళ్తున్న రైల్లోంచి ప్రపంచ ఖ్యాతి పొందిన స్వరోస్కీ క్రిస్టల్ ఫ్యాక్టరీ కనిపించింది.

జిల్లర్ తాల్ బన్" స్టేషన్లో ఆగి రెండు నిమిషాలకి మళ్ళీ బయల్దేరింది రైలు.

ఒక్కొక్కరికీ ఒకో చికెన్ పొట్లం, అర లీటరు మినరల్ వాటరు బాటిల్ పంచేడు జార్జి ప్రసాద్. విప్పుకుని తింటున్నారు. ఉప్పూ కారం లేదు గానీ కమ్మగా ఉంది. గోవిందు తప్ప అందరూ తినేశారు. గోవిందు పొట్లం విప్పి గోవిందు పొట్లం విప్పి కంపార్ట్ మెంట్లో అందరికీ దాన్ని తిప్పి చూపిస్తూ ఇందులో వేసిన మాసం ఏంటని సైగల్తో అడుగుతున్నాడు చందర్రావు. చాలా మంది లేంబ్ అన్నారు. కొందరయితే బీఫ్ అన్నారు. చివరికి తేలిందేంటంటే అది ఒక ఆవుదూడ మాంసం. నెత్తి నోరూ బాదుకుంటూ బాత్ రూమ్ లో కెళ్ళి కక్కుకోవడం మొదలెట్టాడు చందర్రావు.వేలకి వేల ఎకరాల్లో మైదానాల మీద పడే ఎండపొడలు కొండల మీదెక్కడో పురాతనమైన కేజల్స్, చర్చిలు అవి చూస్తుంటే మధుమతి సినిమాలో ఆజారే పరదేశీ గుర్తుకొస్తుంది. హోటలు రూమ్ లో ఉన్న షహనాజ్ గుర్తుకొస్తుంది.

ఓర్ల్ స్టేషన్లో ఆగింది రైలు. అప్పటికి వాళ్ళు రైలెక్కి గంటయింది. అంటే సాల్స్ బర్గ్ వెళ్ళడానికి ఇంకా గంట పడ్తుంది. అది వేళ్ళకి వేసవి కాలమట. జీవన్ కి మాత్రం ఒక వెచ్చటి శీతాకాలం మధ్యాహ్నం లాగుంది. పక్కన ముగ్గురబ్బాయిలూ, ఒక అమ్మాయీ కల్సి పేకాడుతున్నారు. అదో రకంగా ఉన్నాయి వాళ్ళ పేక ముక్కలు. ఆ అమ్మాయి వైలెట్ కలర్ స్లీవ్ లెస్ బనియన్ లాంటిది వేసుకుంది. లోపల నల్లని బ్రా. దాని తాళ్ళు బయటికి కనిపిస్తున్నాయి. అమ్మాయి ముఖాన్నే చూస్తున్నాడు జీవన్. ముక్కు, నోరూ కొంచెం ఏకమైంది. పాము ముఖం లాగుంది. పల్చగా నల్లగా ఉన్న సిల్కు పాంటు బాగా జరిగిపోయింది కిందికి.సాల్స్ బర్గ్ దగ్గర పడ్తున్న కొద్దీ జీవన్ మనసు అదో విధంగా అయిపోవడం మొదలెట్టింది. ఎన్నో ఏళ్ళ నించి నేను విన్న చదివిన మొజార్ట్ పుట్టిన ప్రదేశానికి వెళ్ళబోతున్నాడిప్పుడు. అన్న ఫీలింగ్ తో జ్వరమొచ్చినట్టు అదోలాగయిపోతూ ఎప్పుడొస్తుందా ఆ వూరు అని చూస్తున్నాడు.

చూస్తున్న కొద్దీ ఆలస్యమవుతుంది.

ఎంతకీ రావడం లేదు.

అలా చూసిన జీవన్ కి మాగన్నుగా నిదర పట్టింది.

స్లో అవుతున్న రైలు పెద్ద కాలవ దాటుతుంటే కొండ మీద పెద్ద కేజిల్ కనిపించే సరికి ఒళ్ళు ఝుళ్ళుమంది. అలా చూస్తుండిపోయాడు. వీడియో కెమెరా ఆన్ చేసేడు యోగి.

సాల్స్ బర్గ్ స్టేషన్లో దిగడంతోనే ఒక పావురం వచ్చి అక్కడ వాలింది. అదే ద్యాసలో ఉన్న జీవన్ కి అది మొజార్ట్ ఆత్మేమో అన్న భావన కలిగింది. చాలా పల్చగా జనం ఉన్న స్టేషన్లో నడుస్తుంటే అక్కడా కనిపించిన పావురాల్ని రెప్పార్వకండా చుస్తుండిపోయిన జీవన్ జన్మలో ఎప్పుడు రైల్వే స్టేషన్లో పావురాల్ని చూడ్డం జరగలేదు.

స్టేషన్ బయటికొచ్చాకా జార్జి ప్రసాదు అడగమంటే మొజార్ట్ మ్యూజియం ఎక్కడని చాలా మందిని అడిగేడు గోవిందు. ప్రతివాళ్ళు షోల్డర్ ఎగరేసి తెలీదని చెప్పడం తప్ప ఇంకేం అన్లేదు. జీవన్ దగ్గరికొచ్చి “ఇదేంటి సార్, మీరేమో ఇది మొజార్ట్ ప్లేసన్నారు. అడుతుతుంటే ఒక్కడూ మాటాడ్డేంటి..?” అన్నాడు గోవిందు.

“మన ఇంగ్లీషు ఏక్సెంట్ వాళ్ళకి అర్థం గావటం లేదని నా డౌటు. పైగా వీళ్ళు కూడా మనలా టూరిస్టులు” అన్నాడు యోగి. చివరికి ఒక బ్రిటీషనర్ కి కొంచెం అర్థమైంది గోవిందు బాధ. దగ్గర్లో ఆగి ఉన్న ట్రామ్ కేసి చూపించి దాని డ్రైవర్ని అడగమనే సరికి అటు పరిగెత్తేడు.గోవిందు అన్న దాంట్లో ఒక మొజార్ట్ అన్న ముక్కం మట్టుని అర్థం చేసుకున్న డ్రైవరు జర్నని లో అడిగేడు. అతని హావభావాల్ని బట్టి ఎంత మంది అన్నట్టు అర్థమైంది. “ఫైవ్... ఫైవ్...” అని అయిదేళ్ళు చూపించాడు యోగి. డబ్బులు తీసుకుని టిక్కెట్టిచ్చేడు డ్రైవరు. వాళ్ళు సీట్లలో కూర్చున్న కాస్సేపటికి కదిలింది ట్రామ్ బండి. చాలా బాగుంది ట్రామ్ లో ప్రయాణం.

ముఖ్యంగా లోపల శుభ్రం. ఆ సీట్లు కుట్టిన విధానం అబ్బో.... అద్భుతం.

రకరకాల ప్రదేశాల్ని దాటుకుంటూ ముందుకెళ్తుంది ట్రామ్.

బ్రిస్టల్ హోటల్ అన్న బిల్డింగ్ దాటాకా మోడ్రన్ కట్టడాలు పోయి పాతకాలం నాటి భవనాలూ చిన్న చిన్న కోటల్లాంటివి, చర్చిలూ ఎదురవుతాయి ఆ సిటీలో. అది ఓల్డ్ టౌనట.

ఒక చోట ఆగింది ట్రామ్ బండి.

చాలా మంది దిగుతున్నారు. వాళ్ళతో పాటూ వీళ్ళూ దిగారు.

వీళ్ళతో పాటు దిగిన గుంపు కూడా మొజార్ట్ ప్లేసెస్ చూడ్డానికే అని అర్థం గావటంతో ఆ గుంపు వెనకే నడుచుకుంటూ వాళ్ళెటు వెళ్తే వీళ్ళూ అటు వెళ్ళారు. ఆల్మోస్టు వాళ్ళని ఫాలో అయ్యేరు.

రెండు మూడు మలుపులు తిరిగాక ఆ వీధిలోకి మలుపు తిరిగి అలాగుండిపోయేడు జీవన్.

ఆ వీధి వెడల్పు కేవలం ముప్పై అడుగులు కూడా ఉండదు. ఎడా పెడా ఆకాశాన్నంటే భవనాలు, షాపులు మ్యూజిక్ ఇనుస్ట్రుమెంట్స్ అమ్మే షాపులూ, పెద్ద పెద్ద క్లాత్ షోరూమ్స్, స్వరోస్కీ షోరూమ్స్ అన్నీ పెద్ద పెద్దవి. రకరకాల దేశాల్నించి వచ్చిన టూరిస్టులతో కళకళ్ళాడి పోతుందా సందు. ఆ సందుకి ఎదురుగా ఎత్తైన కొండ. ఆ కొండ మీద రైల్లో వచ్చేప్పుడు వీళ్ళు చూసిన పెద్ద కేజిల్.

కొంచెం ముందుకెళ్ళాకా ఆ సందుకి ఎడం పక్కన పసుపు రంగు వేసుకున్న నాలుగు ఫోర్ల భవనం. అందులో మూడో ఫోర్లో పుట్టాడట మొజార్ట్. బిల్డింగ్ బయట రాసుంది మొజార్ట్ బర్త్ ప్లేస్ అని.

ఒకో టిక్కెట్టూ అయిదున్నర యూరోలు.

టిక్కెట్లు ఇచ్చే అయ్యాయి యోగి చేతిలో హేండీ కేమ్ చూసి "లోపల ఫోటోలు తియ్యకూడదు" అంది ఇంగ్లీషులో.

"తీస్తే..?" అన్నాడు.

జవాబుగా ఏదో అందిగానీ వీళ్ళకి అర్థం కాలేదు. వెళ్తున్న ఒక మనిషి కి రెండో వాడు ఎదురైతే క్రాసయి వెళ్ళలేనంత ఇరుకైన దారమ్మట నడుచుకుంటూ ఆ భవనం మూడో అంతస్తులోకి వెళ్తున్న జీవన్ కి ఒక రకమైన ఆనందం. అతని విషాద చరిత్ర చదివి ఉన్న జీవన్ లో ఒక రకమైన వేదన. చనిపోబోయే రోజుల్లో అతను రాసిన సింఫనీ, కోటీశ్వరుల ఇళ్ళల్లో విందులూ వినోదాలూ జరిగేప్పుడు వాయించమని ఎరేంజ్ చేయించుకునే రిచ్చెస్ట్ సింఫనీ అట.

మూడో ఫోర్ లోకి వెళ్ళాకా మొదటి గదిలో చూసింది మొజార్ట్ వాడిన చెంబులూ, బిందెలు, గ్లాసులూ, తపేళాలూ వగైరా సామాగ్రి. తర్వాత ఒక టాంగా, ట్రంకు పెట్టి, వెదురు బద్దలతో చేసిన బుట్ట.., ఇంకొంచెం ముందు కెళ్ళారు. ఒక పియానో... బహుషా మొజార్ట్ తండ్రి అయిన లియో పోల్డ్ మొజార్ట్ కూడా మ్యూజిషియన్ గాబట్టి ఆయనదై ఉంటుంది. దయచేసి దాన్ని ముట్టుకోవద్దు అని జర్మనీలోనూ ఇంగ్లీషులోనూ రాసుంది. నెమ్మదిగా నడుచుకుంటూ ఇంకొంచెం ముందుకెళ్ళారు. అద్దాల్లో పెట్టి ఉన్న చిన్న వయోలిన్ అది. ఆ వయోలిన్ తో మొజార్ట్ అయిదో ఏట ప్రోగ్రాం ఇచ్చాడట. దాని పక్కనే అతను వాడిన వయోలా (వయోలిన్ ఫేమిలీ), ఇంకొంచెం ముందుకెళ్ళాం... మొజార్ట్ వాడిన వయోలిన్. చాలా చిన్న వయసులో చనిపోయిన అతను మరణించే దాకా వాడిన ఇనుస్ట్రుమెంట్ ఇదే.

అక్కడ్నించి ఇంకో గదిలోకెళ్ళారు. చిన్న గది అది. అందులో ఆనాటి మంచం పరుపూ దిళ్ళు వేసి ఉన్నాయి. 1756 జనవరి 27 వ తేదీన పుట్టాడట మొజార్ట్. ఒక్కసారి కళ్ళు మూసుకుని జీవన్ కిష్టమైన మొజార్ట్ ని తల్చుకున్నాడు. అతని విషాదాంతాన్ని చదివిన జీవన్లో ఒక రకమైన వేదన, అదో రకంగా అయిపోయాడు. చెప్పు కోడానికి జీవన్ పక్కన మొజార్ట్ గురించి తెల్సిన మనిషెవరూ లేడు. ఒకానొక వేదనతో చాలా బరువుగా తయారైంది మనసు.

1747 నించి 1773 దాకా మాత్రమే మొజార్ట్ ఫామిలీ మెంబర్స్ ఆ ఇంట్లో ఉన్నారట. క్రిందికి నడుస్తుండగా ఒక విషయం గుర్తుకొచ్చింది జీవన్ కి. ఇళయరాజా గారి దగ్గర పరిచయమైన వయోలినిస్ట్ నర్సిమ్మన్ గారు చాలా ఏళ్ళ కిందట చెప్పారు. ఆనాడు మొజార్ట్ వాడిన వయోలిన్ తో అతని సింఫనీలు కొన్ని వాయించారట. ఇప్పుడు అతని బర్త్ ప్లేస్ లో అవి అమ్ముతున్నారట.

అదొక ఫాన్సీ షాప్ లాగుంది. అక్కడున్న పెన్సిళ్ళకీ, యాష్ ట్రేలకీ, దువ్వెనలకీ, కీ చైన్స్ కీ, ఉంగరాలకీ, బొంగరాలకీ, అన్నిటికీ మొజార్ట్ పేరు పెట్టి అమ్మెయ్యడం కొంచెం బాధగా అనిపించింది యోగికి.

నర్సిమ్మన్ చెప్పిన కేసెట్ గురుంచి అడిగాడు జీవన్.

అతని లివింగ్ ప్లేస్ లో దొరుకుద్ది అన్నాడు సేల్స్ మెన్. అదెక్కడా అంటే ఈ అపార్టుమెంట్స్ దిగాక ముందుకెళ్తే ఒక సందు వస్తుంది, దాంట్లోంచి నడుచుకుంటూ వెళ్తే ఒక కాలువ కనిపిస్తుంది. ఆ కాలువకి రెండు పక్క పక్కనే రెండు బ్రిడ్జీలు ఉంటాయి. ఒకటి వాహనాలు వెళ్ళేది, రెండోది మనుషులు నడిచేది. ఆ బ్రిడ్జీలు దాటి వెళ్తే ఒక థియేటర్ (సునిమా థియేటర్ కాదు, మ్యూజికల్ డ్రామాలూ, ఒపేరా సింగింగ్ ప్రోగ్రామ్స్ తాలూకు థియేటర్ అది) కనిపిస్తుంది. అది కూడా దాటండి మెయిన్ రోడ్డు తగుల్తుంది. దాని ఎడం పక్క హోటల్ బ్రిస్టల్ కుడి పక్కన మొజార్ట్ లివింగ్ ప్లేస్.

ఏ అవస్థా పడకండా అక్కడికెళ్ళాం.

మూడు వందల ఏళ్ళనాటి ఒక పురాతన భవనం. దాని మీద MOZART WOHNHAUS అని రాసుంది జర్మన్ లో.టిక్కెట్టుంటే మేం రాము అన్నారు మాతో వచ్చిన జార్జి ప్రసాదూ, చందర్రావూ, గోవిందూ.

లోపలికెళ్ళడానికి అయిదున్నర యూరోలట. రెండు టిక్కెట్లు కొన్నాడు జీవన్. టిక్కెట్లిస్తూ ఆ లేడీ “ఇంగ్లీష్..?” అంది. అవునన్నాడు జీవన్.

కార్డ్ లెస్ ఫోన్ రిసీవర్ లాంటిది తీసి దానికున్న చాలా బటన్స్ లో ఒకటి నొక్కి వాళ్ళకిచ్చి ఇందులోంచి ఇంగ్లీష్ లో కామెంట్రీ వస్తుంది వింటూ వెళ్ళండి అంది. చెవి దగ్గర పెట్టుకుని వింటూ నడుచుకుంటూ పైకెళ్ళారు. ముందు మొజార్ట్ మ్యూజిక్ తర్వాత కామెంట్రీ స్టార్టయ్యింది. మొజార్ట్ లైఫ్ టైమ్ లో గొప్ప వర్క్. రెండు వందల సింఫనీలు ఈ ఇంట్లోనే రాశాడంట.

పైన మొజార్ట్ వాయించిన గ్రేండ్ పియానో, రాసుకునే టేబులూ కుంచె ఇంకు బుడ్డీ స్వదస్తూరీతో ఉన్న సింఫనీ నోట్సూ, వాడిన బెడ్డూ, చెయిరూ బాత్ రూమూ లాంటి వన్నీ ఉన్నాయి. ఆరున్నర ట్రైనుకి టైమయింది. తన వల్ల తక్కిన వాళ్ళు ఇబ్బంది పడతారు అన్న ఒక వర్రీలో మొత్తం అంతా చూసి దిగి వస్తున్నాడు జీవన్. వరల్డ్ గ్రేటెస్ట్ కంపోజర్ మొజార్ట్. పియానో సొనాటా నెం.11, సింఫనీ 41 జూపిటర్, సింఫనీ 626, పియానో కాన్సెర్ట్ 21, సింఫనీ 40 (మోల్ట్ అతిగో) రాసి అతి చిన్న వయసులో

మరణించిన ఆ మహానుభావుడి భవనంలోంచి బయటికొస్తూ కింద స్టోర్స్ లో వాళ్ళకి కావాల్సిన సి.డి లు అడిగితే చూపించారు. ఒకోటీ 22 యూరోలు యోగి కొన్నాడు. తిరిగి స్టేషన్లో కొచ్చాక అందరికీ టిక్కెట్లు యోగే కొన్నాడు.

ట్రైన్ కి ఇంకా అరగంట టైముంది. అక్కడొక షాపులో ఫ్రెండ్ కోసం గమ్మత్తయిన బ్లాక్ అండ్ వైట్ కేలెండర్ కొనడానికి వెళ్ళాడు యోగి. చవగ్గా ఏం దొరుకుతుందా అని వెతుకుతుంటే నల్లటి ముసుగులో నీలి కళ్ళ గ్రూప్ కనిపించింది. అంతే, షాకయిపోయేడు జీవన్. షహనాజ్ కళ్ళు ఇక్కడికెలా వచ్చాయి అనిపించింది. వెంటనే కొనేసేడు. షహనాజ్ ఎప్పటికయినా తన సంపూర్ణ దర్శనం ఇస్తుందో లేదో నోరు విప్పి అడిగేస్తే..?? అది కరెక్టయిన పని కాదు.

కాస్సేపట్లో ట్రెయిన్ ఎక్కబోతున్న ఒక ప్రియుడు, ప్రియురాల్ని విడవలేక చాలా గట్టిగా కౌగిలించుకుని ఏడుస్తున్నాడు. పుష్టిగా ఉన్న అమ్మాయి మట్టుకి అతని కోసం కౌగిలించుకుంది గానీ కొంచెం అనీజీగా ఫీలవుతుంది. దూరం నించి వస్తున్న ఒక అమ్మాయిని కళ్ళతోనే రమ్మని సైగ చేస్తుంది.

ఆ అమ్మాయి కేవలం యాక్ట్ చేస్తుందని అనుమానించిన ఆ ప్రియుడు గొడవకు దిగాడు. ఆ పిల్ల అతన్ని కన్విన్స్ చేసే ప్రయత్నం చేస్తుంది. ప్లాట్ ఫారం వేపు నడిచేరు.

అనుకున్న టైముకి వచ్చాగింది రైలు.

వచ్చేటప్పటిలాగ కాకండా ఎవరికి దొరికిన సీట్లో వాళ్ళు కూర్చున్నారు. జీవన్ కి ఎదురుగా ఉన్న అమ్మాయి పొడుగాటి చాక్లెట్టు తింటూ డిస్క్ మెన్ లో మేరియాక్యూరీ పాటలు వింటుంది.

కూఫ్ స్పెయిన్ దాటాకా బాత్ రూమ్ దగ్గర కెళ్ళాడు జీవన్. తలుపు లోపలికి వేసుకుంది. లోపల ఇంటర్ కోర్స్ తతంగం జరుగుతుంది. ఆ కేకలూ మూలుగులూ జర్మన్ లో ఏవో పదాలు బయటికి వినిపిస్తున్నాయి. నా పక్కనించెళ్ళిన ఇద్దరు మనుషులు వాటినేం పట్టించుకోకండా వెళ్ళిపోతున్నారు.

కాస్సేపటికి బయటికొచ్చిన ఆ జంట చాలా మాములుగా వెళ్ళి వాళ్ళ సీట్లలో కూర్చున్నారు.

ట్రెయిన్ “జిల్లర్ తాల్ బన్” దాటాకా వచ్చిన గోవిందు “జార్జి ప్రసాదు గారూ, వాళ్ళు రెస్టారెంట్లో ఉన్నారు. మిమ్మల్ని రమ్మంటున్నారు” అన్నాడు.వెళితే రాడ్లర్ బీరు తాగుండగా రాత్రి ఎనిమిదయ్యింది. అయినా చికటి పడలేదు.కరక్ట్ గా ఎనిమిదిన్నరకి ఆగింది ట్రయిను.కెసినో కెళ్ళి జాస్తి చౌదరి గారు వస్తే తీసుకుని వెళ్ళిపోదాం అన్నాడు జార్జి ప్రసాదు. సరే అనేసి బయల్దేరారు.కోటు లేకుండా కేసినో లోపలికి రానివ్వరు. ఇది గవర్నమెంటు రూలు. రిసెప్షన్ కౌంతర్లో అమ్మాయి వీళ్ళ పాస్ పోర్టులు తీసుకుని కోట్లు ఇచ్చింది.పైకెళ్ళారు.ఆకాశంలో నక్షత్రాల్లా సీలింగ్ డెకరేషన్.

ఎక్కడెక్కడినించో జనం. ఒకళ్ళ మీద ఒకళ్ళు వాలిపోతూ వస్తూ పోతున్న అమ్మాయిలూ, అబ్బాయిలూ... కోట్లలో గేంబ్లింగ్ జరుగుతుందక్కడ. ప్రొద్దుట చూసింది జస్ట్ శాంపిల్ అంతే.

ఆడుతున్న ఒకడికి మెషిన్ లో 777 వచ్చాయి. అలా వస్తే వెయ్యి యూరోలు. మన లెక్కలో యాభై వేలు. అది చూసిన చందర్రావు “ఒరే గోవిందూ ఈ ట్రిప్పులో చాలా డబ్బులు తగలేస్తున్నాం గదా..? ఇక్కడ ప్రతిదీ రేటెక్కువే అవునా...?” అన్నాడు.

ఔనన్నాడు గోవిందు.

పద మనం కూడా ఓ మిషను దగ్గరికెళ్ళి ఆడదాం అని జేబులోంచి అయిదు యూరోల నోట్లు మెషిన్లో పెట్టి ఆడ్డం మొదలెట్టాడు.ఆరంభంలోనే పదిహేను యూరోలొచ్చాయి.

“మీది బలే హేండండీ” అన్నాడు గోవిందు.

“మీకు నా గురించి బొత్తిగా తెల్దు. మా రాజమండ్రిలో ఎవరు ఏం బిజినెస్ ఓపెన్ చేసినా నన్నే పిలుస్తారు. చంటి పిల్లకి అన్న ప్రాసన చేయించేటప్పుడు నేను లేకుండా చేయించరు తెల్సా..? ద్వారపూడి సంతలో ఎన్ని బట్టల కొట్టులు మన చేత్తో ఓపెన్ చేయించేను...” అని చాలా గొప్పగా అంటా మళ్ళీ మిషను ముందు కూర్చున్నాడు.

పావు గంటలో రెండొందల యూరోలు పోయే సరికి గొళ్ళుమన్నాడు.

ఇంకో గంట తర్వాత అంతా బయటికొచ్చేరు.

13

వంశీ యాత్ర

బస్టాండ్ కొచ్చి అడిగితే ఏర్జమ్స్ బస్సు లేదట. టాక్సీని పిలుద్దాం అనుకునే లోపు ఒక డ్రగ్ ఎడిక్ట్ తగిలాడు. వాడు హోమో సెక్సువల్ కూడా.

టాక్సీ వచ్చింది.

ఎక్కడికెళ్ళాలో చెప్పి కూర్చున్నారు.

డ్రైవరు టర్కీ దేశం మనిషి. వాళ్ళ దేశం పాటలు పెట్టాడు.

ఘాట్ రోడ్డు దిగి ఊళ్ళో కొచ్చారు.

హోటలు కొచ్చే సరికి పదిన్నరయిపోయింది.

అంతా ఎవరి రూముల్లోకి వాళ్ళెళ్ళిపోయారు.

భోజనాల హాల్లోకి వెళ్ళే సరికి తాగుతూ కనిపించాడు ప్రొడ్యూసర్ సలీం భాయ్.

వర్కెలా జరుగుతుంది అనడిగేడు జీవన్. "బాగుంది భాయ్, నా పని హిల్టన్ హోటల్లో పెట్టిన హీరో సందేశ్ ని చూసుకోవడమే గదా...! అయినా జార్జి ప్రసాదు ఉండగా నాకేంటి బెంగ చెప్పు. ఆరు హోటల్సున్నాయి. ఓల్డ్ సిటీలో మదినా హోటలు ఎదురుగా ఉన్న హోటలు మనదే" అన్నాడు.

"పేరేంటి..?"

"హోటల్ షహనాజ్"

"షహనాజ్..!"

“అవును... నా చెల్లెలి పేరు. తన పేరు తో ఏ బిజినెస్ పెట్టినా అది లాభం తెస్తూ ఉంటుంది. నా చెల్లెలికి సంబంధించి ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. మీకు బోర్ అనిపించకపోతే చెబుతాను” అన్నాడు సలీం.

“లేదు చెప్పండి” అన్నాడు జీవన్ షహనాజ్ గురించి తెలుసుకోవచ్చునన్న కుతూహలంతో.

“షహనాజ్ కి అప్పుడు పదేళ్ళుంటాయి అనుకుంటాను. హోటల్ కోసమని పెయింటింగ్స్ కొనడానికి కనావంచన్ తో ఇంద్ర అనే ఆర్టిస్ట్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ జరుగుతుంటే వెళ్ళాను. నాతో పాటు షహనాజ్ కూడా వచ్చింది. తనకి ఓ పెయింటింగ్ ఎంతగానో నచ్చింది. పొడవాటి కోటు, షూస్ వేసుకున్న పదేళ్ళ కుర్రాడు రైల్వే స్టేషన్ లో బెంచి మీద కూర్చొని కళ్ళ గంతలు కట్టుకుని వయోలిన్ వాయిస్తున్నాడు. పక్కనే బెంచి మీద పండుటాకులు రాలి ఉన్నాయి. ఆ ఆకుల మీద బొద్దుగా నల్లగా వున్న కుక్క పిల్ల ముందరి కాళ్ల మీద తల పెట్టి మగతగా కళ్ళు మూసుకుని వింటూంది.

ఆ పెయింటింగ్ కొనిచ్చాను. అంతటితో ఊరుకోలేదు. ఆ పెయింటింగ్ లో వున్న వయోలిన్, బొద్దుగా వున్న నల్లటి కుక్క పిల్ల కావాలని మంకు పట్టు పట్టింది. వయోలిన్ అయితే వెంటనే కొనిచ్చాను. నలటి కుక్క పిల్ల కోసం నానా తంటాలు పడాల్సి వచ్చింది.

నా చెల్లెలు కోరితే కొండ మీదున్న కోతి నైనా తెచ్చిస్తాను” అన్నాడు. “పెద్దయ్యాక వయోలిన్ నేర్చుకుంటానంది, నేర్పించాను. ఎక్కడికెళ్ళినా తనతో పాటు వయోలిన్ కూడా వుండాల్సిందే. అదంటే దానికంత ప్రాణం” అని చెపుతుంటే తన వాయులీనంతో షహనాజ్ మా ముందు ప్రత్యక్షమైనట్టు అనిపించింది జీవన్ కి.

అక్టోబర్ – 7

తన రూమ్ బాల్కనీలో కొచ్చి చూస్తుంది షహనాజ్. అవతల రెండు ఇళ్ళు తగలబడి పోతున్నాయి. మొత్తం ఏగ్జమ్స్ లో జనం అంతా అక్కడే ఉన్నారు. ఫైర్ ఇంజన్లూ వచ్చాయి కానీ, అక్కడ ఇళ్ళకి సగానికి పైగా కలప వాడతారేమో ఓ పట్టాన ఆరడం లేదు మంటలు. యోగి, వంట మనిషి రామూ, వాడి అసిస్టెంట్లు మంటల దగ్గర కెళ్లారు.

రూమ్ లోపల కొచ్చే సరికి ఫోన్ మోగుతూ.... షహనాజ్

"పాపం వాళ్ళని చూసి రాలేకపోయారా...?" అంది

"చూసి ఏం చేస్తాం.... అయినా మీరు పాపం అనక్కర్లేదు. వాళ్ళకి అన్నిటికీ ఇన్సూరెన్స్ లు ఉన్నాయట" అన్నాడు జీవన్.

"సాల్స్ బర్గ్ వెళ్ళారట మొజార్ట్ స్టాచ్యూ చూసేరా నిజంగా ప్రాణం ఉన్నట్టుంటుంది గదా...?" అంది.

"చూళ్ళేదే, అయినా మీకెలా తెల్సు...?" అన్నాడు జీవన్.

"మా అంకుల్ తో పాటు వెళ్ళాను. వారం పాటు అక్కడే స్టే చేశాం. మొజార్ట్ పేరున్న వస్తువులన్నీ కొన్నాను. గెట్రియడిగేస్సేలో ఉన్న మొజార్ట్ బర్త్ ప్లేస్ చూశారా...?" అంది.

"చూశాం, చాలా ఇరుకు సందు అది" అన్నాడు జీవన్.

నవ్వేసిన షహనాజ్ "యూరప్ మొత్తం చాలా ఫేమస్ స్ట్రీట్ అది. సాల్స్ బర్గ్ వచ్చిన వాళ్ళెవరన్నా సరే కనీసం ఒక్కసారన్నా ఆ ఇరుకు వీధిలో నడిచి వస్తారు. ఆ వీధిలో ఇళ్ళన్నీ మూడు వందల ఏళ్ళ నాటివి" అంది.

"మొజార్ట్ మత్తు ఇంతట్లో వదలదు నన్ను. అతని గురించి ఇంకా చెప్పండి" అన్నాడు జీవన్.

"27 జనవరి 1756 లో సాల్స్ బర్గ్ లో పుట్టిన మొజార్ట్ డిసెంబర్ 1791 న ఆ వర్షం రోజు వియన్నాలో చనిపోయాడు. చాలా తక్కువ కాలం బతికిన ఇతను ఆరువందల వర్క్స్ చేశాడు.

అతను హృదయం లోతుల్లోకెళ్ళి రాసిన సింఫనీ కె.516 (జి.మైనర్). ప్రపంచమంతా పాపులర్ అయిన సింఫనీ కె.515(సి). ఆఖరి

నాలుగు సింఫనీలూ 38(డి), 39(ఇ ఫ్లాట్), 40(జి.మైనర్), 41(సి) నాలుగో ఏటే కళ్ళకి గంతలు కట్టి మీరు చూపొచ్చిన పియానో ముందు కూర్చోబెడితే అద్భుతంగా వాయించేడు. అలాగే పెద్దయ్యాకా కాలి వేళ్ళతో వాయించిన ఘనుడు మొజార్ట్" అని ముగించింది షహనాజ్.

"మీరూ మాతో వస్తే చాలా బాగుండేది" అన్నాడు జీవన్.

"మీరెవరూ నన్ను పిలవలేదుగా..!" నవ్వుతూ ఫోన్ డిస్కనెక్ట్ చేసింది.

వాళ్ళింటికి ఫోన్ చేపొచ్చిన యోగి డల్ గా పడుకుని ఎప్పుడూ లేంది సాయిబాబా పాటలు పెట్టుకుని వింటున్నాడు. కాస్సేపు గడిచాక తనే "మా ఇంటికి ఫోన్ చేసేను సార్. రికార్డింగులన్నీ పెండింగ్ లో పడిపోయినియ్యి. ప్రొడ్యూసర్లు ఒకటే గొడవ చేస్తున్నారట" అన్నాడు."చాలా విషయాల్తో పాటు ఇలాంటి విషయాలు కూడా మాటాడ్డం సరిగా రాదు నాకు. నాకు తోచినవేవో మాటాడేను" అని కాస్సేపటికి తనే లేచి టేబుల్ ని తన మంచం మీదికి లాక్కుని దాని మీద వాయిస్తూ పాడ్డం మొదలెట్టాడు.

చాలా అనందించేడు జీవన్. కొన్ని పల్లవులకి సెకండ్ హాఫ్ లూ, ముక్తాయింపులూ సజెస్ట్ చేసేడు. మొత్తం మీద ఎనిమిది పల్లవులు చేసి బట్టలు మార్చుకుని బయటికెళ్ళినవాడు రాత్రి పదయినా రాకపోయే సరికి బయటికెళ్ళి చూశాడు జీవన్. విగ్గుతో భోజనం చేస్తూ కనిపించిన జార్జి ప్రసాదు, జాస్తి చౌదరితో "కేసినో కెళ్ళేడు యోగి" అని అన్నాడు.

అర్ధరాత్రిప్పుడో వచ్చి జీవన్ని నిద్రలేపిన యోగి "కేసినోలో వెయ్యి డాలర్లు వచ్చాయి" అని చెప్పేడు.

"మళ్ళీ తిరిగి ఎంత పోగొట్టుకున్నావ్..?" అంటే అది చెప్పలేదు.

"మీకేదన్నా మంచి గిఫ్ట్ కొనాలనుకున్నాను" అంటుండగా దబ దబా తలుపు మోగింది. వెళ్ళి తెరిస్తే కో – డైరెక్టర్ గంగరాజు. నైటీలో ఉన్నాడు. మందు బాగా పడిందేమో సరాసరి వచ్చి కార్పెట్ మీద చతికిలబడ్డాడు.

"ఈ నైటీ ఎవరిచ్చేరు...?" అంటే, "మన హీరోయిన్ సార్, ఇక్కడ కొనడంతో డస్ట్ బిన్ లో పారేద్దాం అనుకుందట. అడిగితే నాకిచ్చింది" అన్నాడు.

“మందెవరిచ్చేరు..?”

"నాగరా ఆపరేటరూ, కెమెరా అసిస్టెంటూ తాగుతుంటే వాళ్ళ మధ్యకి దూరేను. సార్... సార్ ఇప్పుడు నేనో పని మీద వచ్చేను" అన్నాడు."ఏంటి..?" అన్నాడు యోగి."కేసినో లో మీకు వెయ్యి యూరోలు వచ్చినియంట యూనిట్లో అప్పుడే చెప్పేసుకుంటున్నారు.... మీకొచ్చిన దాంట్లో నాకో యాభై యూరోలు ఇవ్వండి సార్. రెండు డ్రస్సులు కొనుక్కుంటాను" అన్నాడు.

"ప్రొడ్యూసర్ని అడగవయ్యా"

“అడగడానికి నా ఎకౌంట్లో బేలన్స్ లేదు సార్. లాస్ట్ సినిమా అప్పుడే ఈ సినిమా ఎమౌంటు కూడా మొత్తం లాగేసేను” అన్నాడు.

“చాలా సంతోషం రేపు కలు”

చాలా థాంక్స్ సార్. గుడ్ నైట్ సార్ అని నడుచుకుంటూ వెళ్తున్న గంగరాజులో ఈ వారం నించి ఆడోళ్ళ బట్టలు వేసుకోవడం వల్ల నడకలో మార్పొచ్చింది. ఆడారితనం బాగా కనిపిస్తుంది.

ఆరోజు మధ్యాహ్నం దాకా చాలా ట్యూన్స్ కంపోజ్ చేసాడు యోగి. మధ్యలో షహనాజ్ మలయమారుతం రాగం లో ఒక పాట చెయ్యండి అనే సరికి ఆ రాగం తెలిదన్నాడు యోగి. ఎసెండింగ్, డిసెండింగ్ చెప్పింది.

ఎడం చెవికి రింగ్ కుట్టించుకున్న వంట కుర్రోడు రాము ఒంటి గంటన్నరకి వచ్చెయ్యండి సార్ లంచ్ కి అని ఫోన్ చేశాడు.

“కుదరదు రెండున్నరకి వస్తాం. ఎందుకని అడగవేం...?” అన్నాడు యోగి.

“ఎందుకు సార్..?” అన్నాడు రాము.

“చలి చాలా ఎక్కువగా ఉంది మేం కోనియాక్ వేస్తున్నాం” అన్నాడు యోగి.

“కాస్త తొరగా రావడానికి ట్రై చెయ్యండి సార్. ఇవ్వాళ్ళ తెల్లవారు ఝాము మూడింటికి లేపేశారు వేణుగారు. కాస్సేపు పడుకుంటాను” అన్నాడు.

“అలాగేలే” అని ఫోన్ డిస్కనెక్ట్ చేసిన యోగి “సార్ పెట్రోల్ బంక్ దాటాకా చాలా పెద్ద సూపర్ మార్కెట్ చూశాను నిన్న బస్సులో వెళ్తా” అన్నాడు.

“అవును యోగి నేనూ చూశాను” అన్నాడు జీవన్.

“దాంట్లో కెళదాం ఇవ్వాళ” అన్నాడు.

“అలాగే” అన్నాడు జీవన్.

భోంచేశాకా నడుచుకుంటూ ఆ పక్కకి వెళ్తూ దార్లో పక్క పక్కనే ఉన్న రెండు స్పోర్ట్స్ షాపుల్లో కెళ్ళారు. భర్త ఒకటి భార్య ఒకటీ నడుపుతున్నారు.

చదరంగం బల్ల అడిగాడు వాళ్ళని.

అర్థంగాక రెండు షోల్డర్లూ ఎగరేశారు వాళ్ళు.

తొమ్మిది డాలర్లకి ఒక బనియన్ కొని బేంక్ కార్డ్ ఇచ్చాడు.

పని చెయ్యలేదా కార్డు. కేష్ పే చేస్తుండగా రెండు పచ్చటి జర్కిన్ లు కనిపించాయి. ఒకోదాని రేటూ మూడు వందల యూరోలు. “అమ్మో మనం కొనలేం” అనుకుని వచ్చేస్తుంతే ఒక పచ్చ జర్కిన్ కనిపించింది. రేటు కేవలం ఎనిమిది యూరోలు మాత్రమే.

చాలా చీప్ అనుకుని రెండు కొనేసి అక్కడే వేసుకున్నారు.

అక్కడ్నించి కిలోమీటరు అవతలున్న సూపర్ మార్కెట్ వేపుకి వెళ్తుంతే అంతా వీళ్ళకేసి చూసి నవ్వుకుంటున్నారు. అర్థం కాలేదు వీళ్ళకి.సూపర్ మార్కెట్లో ఒక ట్రాలీ తీసుకుని రకరకాల వస్తువులు అందులో వేసుకుని ట్రాలిని ముందుకు తోసుకుంటూ వెళ్తున్న వీళ్ళని చూసిన ప్రతి ఒక్కళ్ళు నవ్వుతున్నారు. అర్థం గావటం లేదు.

కొన్న మొత్తం సామాన్లకి ఏభై తొమ్మిది యూరోలు అయ్యింది.

యోగి క్రెడిట్ కార్డు అక్కడ పని చేసింది.

తిరిగి వస్తున్నారు.

సామన్లని రెండు పోలితిన్ బేగ్స్ లో మోసుకొస్తుంటే వాళ్ళకెదురైన జనంలో కొందరు నవ్వులు.

హోటలు దగ్గరికొచ్చాక తెల్సింది వాళ్ళు నవ్వడానికి కారణం ఏంటంటే... వాళ్ళిద్దరూ వేసుకున్న ఆ ఆలివ్ గ్రీన్ జర్కిన్సు. ఆ దేశంలో పాకీ పని చేసేవాళ్ళు ఆ పని చేసేటప్పుడు మాత్రం వేసుకుంటారంట.

కోపమొచ్చిన యోగి ఆ జర్కిన్ విప్పి గదిలో మూల పారేసి "ఇది మా కారు డ్రైవర్ క్కూడా ఇవ్వను" అన్నాడు.

మధ్యాహ్నం షహనాజ్ కోసం ఫోన్ చేస్తే సలీం భాయ్ వచ్చి లొకేషన్ కి తీసుకెళ్ళాడని తెల్సింది. ఆమె అన్ని రోజులలా రూమ్ లో ఉండిపోవడం చాలా గొప్ప అనిపించింది. అప్పుడప్పుడూ విళ్ళతో క్లోజ్ గా ఉండేది కానీ, ఎక్కువగా రూమ్ లో ఒక్కత్తే వుండేది. కళ్ళల్లో దిగుడు బావిలోని శూన్యం, నిశ్శబ్దం కనిపించేవి. వయోలిన్ తో ఎక్కువగా కాలక్షేపం చేసేది.

ఆ అమ్మాయి హృదయంలో అంతు పట్టని రహస్యమేదో వుంది. తెలుసుకోవాలని వుంది జీవన్ కి. కానీ, ధైర్యం చాలడం లేదు. మధ్యాహ్నం నిద్ర లేచాకా కొన్ని ట్యూన్లు చేసేడు యోగి.

రాత్రి భోజనాల హాలులోకి తెల్లటి సూటు లాంటిది ఎర్ర షూస్ వేసుకుని హరిప్రియా, నల్ల డ్రస్సు వేసుకుని అనిల్ దిగారు. ఒక పళ్ళెంలో చికెను ఇద్దరూ స్పూన్లేసుకుని తిన్నారు. ఒకే మగ్ లో యూరోకోలాని చెరో స్ట్రా వేసుకు తాగారు. అన్నం కూరలూ ఒక పళ్ళెంలో వేసుకుని తింటుంటే యూనిట్లో వాళ్ళంతా వాళ్ళనే చూస్తున్నారు.

అంతలో గోవిందు చేసిన మిమిక్రీ ప్రోగ్రాం చూసి అంతా నవ్వుతున్నారు. లాస్ట్ ఐటమ్ గా శంకరాభరణంలో ఒక పాట. ఆ క్లాసికల్ సాంగుని అక్కినేని అయితే ఎలా చేస్తారు ? ఎన్ టి ఆర్ ఎలా చేస్తారు ? అని చేసి చూపిస్తున్న గోవిందు చాలా ఫాస్ట్ గా చేస్తుంటే మధ్యలో ఒక లేడీ వచ్చి ఎలా బడితే అలా ఆడేసింది.ఎవరా అని చూస్తే గంగరాజు. అవాళ్టితో రెండో పాట అయిపోయిందట. దానికి హీరోయిన్ కి వాడిన డ్రస్సుట అతనేసుకున్నది.

అక్టోబర్ – 8

మర్నాడు నిద్ర లేచే సరికి టైమెంతయిందో తెలిదు. ఏగ్జమ్స్ కొండల వెనక ఎర్రగా ఉంది ఆకాశం. ఇంకాస్సేపటిలో సూర్యోదయం కాబోతుంది. అంతలో నిద్రలేచిన యోగి "గొంతంతా నొప్పిగా ఉంది సార్, డాక్టర్ దగ్గరకెళ్ళాలి" అన్నాడు.

వేణు దగ్గర కెళ్ళి చెబుదాం అనుకుంటుండగా, ఆ వేణుక్కూడా జ్వరంగా ఉందట.

301 లోకి వెళ్ళే సరికి వంట కుర్రోడు రాము బెర్ముడా వేసుకుని పడుకున్న వేణు కాళ్ళు నొక్కుతున్నాడు.

యోగి గొంతు గురించి చెప్పి "వాడూ, మీరూ కల్సి డాక్టర్ దగ్గరకెళ్ళగూడదా..?" అన్నాడు జీవన్.

"ఇక్కడ డాక్టర్లు మనల్ని చూడరు. చూడాలంటే చాలా తతంగం ఉంది" అన్నాడు.

"తతంగం అంటే...?"

"మనం ఇక్కడి కొచ్చేముందు ప్రతి ఒక్కళ్ళకీ యునైటెడ్ ఇండియా వాళ్ళ దగ్గర ఇన్సురెన్స్ చేయించాను. ఇప్పుడు డాక్టర్ మమ్మల్ని చూడాలంటే మా ఇన్సురెన్స్ పోలసీలు చూడ్డంతో పాటు ఢిల్లీలో ఉండే ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్ళతో మాటాడాలి. వీడి ప్రశ్నలన్నిటికీ వాళ్ళు సమాధానం ఇవ్వాలి. అమ్మో చాలా గొడవ" అన్నాడు. అంతలో అక్కడి కొచ్చిన జాస్తి చౌదరి "పోన్లే ఇవాళ్టికి యోగిని రెస్ట్ తీసుకోనియ్యండి. షూటింగ్ స్పాట్ కి వెళ్దాం పదండి" అన్నాడు.

"అక్కడికి మేమెందుకు..?" అన్నాడు జీవన్.

"ఇవాళ షూటింగ్ వరల్డ్ ఫేమస్ స్వరోస్కి ప్రెమిసెస్ లో. ఇలాంటి ఛాన్సు మళ్ళి రాదు పదండి" అన్నాడు.

స్వరోస్కి... 1862 లో పుట్టి 1956 లో మరణించిన డేనియల్ స్వరోస్కి గ్రూపు ఫౌండర్ స్వరోస్కిలు ఫాక్టరీ లోపలకెళ్ళి చూడాలన్న నా కోరిక తీరబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

పావుగంటలో రెడీ అయిపోయిన వేణు రోజుకీ యాభై యూరోలు పెట్టి అద్దెకి తెచ్చిన కారు డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. యోగి, జీవన్, జాస్తి చౌదరి, చిన్నారావు గారూ గబ గబా ఎక్కేసారు.

కారు బయల్దేరింది.

దగ్గర దగ్గర పదిహేను కిలోమీటర్ల ప్రయాణం.

ఆ ఫాక్టరీలో కెళ్ళే సరికి పదిహేను బస్సులు ఆగి ఉన్నాయి. రకరకాల దేశాల్నించి వచ్చిన జనం దూరంగా ఫాక్టరీ లోపలికెవరికీ ఎంట్రీ లేదట. దాని కెదురుగా పెంచిన గడ్డిని పెద్ద తలకాయ బొమ్మ షేపులో కత్తిరించారు. కళ్ళ దగ్గర అతికించిన పెద్ద పెద్ద క్రిస్టల్స్ లో రంగులు మారుతున్నాయి. ఆ తలకాయ కింద ఉందట స్వరోస్కి నిపుణులు తయారు చేసిన నగల ప్రదర్శనశాల.షూటింగ్ దగ్గర కెళ్ళారు.పరుగెత్తుకుంటూ ఎదురొచ్చాడు సలీం.

హీరో సందేశ్ మూమెంట్ నేర్చుకుంటున్నాడు.

అక్కడో పది నిమిషాలున్నాక జార్జి ప్రసాద్ వెళ్ళి ఒక అరడజను టిక్కెట్లు తెస్తే స్వరోస్కి క్రిస్టల్ వరల్డ్ కెళ్ళారు.

లోపలికి ఎంటరయిన వెంటనే నగ తయారు చెయ్యడానికి ప్రపంచం మొత్తం మీద అతి పెద్ద రాయిని అద్దాల మధ్యలో పెట్టారు. కుడి పక్క అద్దాల్లో లైఫ్ సైజ్ నల్లటి గుర్రం బొమ్మని నగలతో అలంకరించారు. జనం ఒక పక్క నించి అడ్డొచ్చేస్తున్నారు గానీ, ఎంత సేపయినా చూద్దామనిపించేంత బాగుందా డెకరేషను. ఎడం పక్క ఏబ్ స్ట్రాక్ట్ మనిషి బొమ్మ. ముంజేతికి వదులుగా పెద్ద క్రిస్టల్. ఇంకో పక్కకి సాల్విడార్ డాలి టైమ్ రన్నింగ్ అవుట్ పెయింటింగ్ ని రాయితో చేశారు. అసలు ఒరిజినల్లో డాలి వేసిన పెయింటింగ్ ఎలాగుంటుందంటే పెద్ద గడియారాన్ని మడత పెట్టి చెట్టు కొమ్మకి ఆరేసి ఉంటుంది. ఇక్కడ అదే గడియారాన్ని మడత పెట్టి హేంగర్ కి తగిలించారు. మైకు పట్టుకుని వచ్చిన ఒకమ్మాయి జర్మన్ భాషలో అయిదు నిమిషాల పాటు మాటాడాకా చప్పట్లు

కొట్టారంతా. అక్కడ్నుంచి గుంపు ముందుకి కదుల్తుంటే వీళ్ళూ కదిలేరు.

లోపల త్రీడీ షో జరుగుతుంది.

ఆ మ్యూజిక్కు విజువల్సూ చూస్తున్న జనాన్ని ఇంకో లోకానికి తీసుకెళ్ళిపోతున్నాయి. కలల్లో కనిపించే లోకాలు గుర్తుకొస్తున్నాయి. అంతా చీకటి మయం. అక్కడ్నించి ఇంకో హాల్లో కెళ్ళాలి. మైల్డ్ మ్యూజిక్. అంతా కదుల్తుంటే వాళ్ళని ఫాలో అయ్యేరీళ్ళు.పెద్ద పుర్రెకి నగలు అలంకరించారు. నోట్లో క్రిస్టల్స్ అద్దిన సిగరెట్. అలాంటి చాలా రకాల బొమ్మలు.

ఇంకో చోట క్రిస్టల్ మెడిటేషన్ రూమట. అక్కడ కాస్సేపు ఆగి నడుస్తుంటే నిజంగానే కలలో ఏదో లోకంలో ప్రయాణం చేస్తున్నట్టుంది. క్రిస్టల్ థియేటరూ కెళ్ళాలి. కుందేలు పిల్లా చంటిపిల్లా కల్సి ఒక పుల్లకి పెద్ద ద్రాక్ష పళ్ళ గుత్తి. మధ్యలో ఒకో పండు కట్ చేసి లోపల క్రిస్టల్ అద్దారు. ఇంకో చోట తావరాకుల తీగ కొన్ని ఆకుల మధ్యలో రంగు రంగుల క్రిస్టల్స్ అతికిన సీతాకోకచిలుకలు ఇలా రకరకాల అలంకరణలు.ఒకచోట చిన్న దారి కనిపించింది. తెల్లగా పొంగుతున్న పాల నురుగు లాగుంది. మా ముందు జనం ఎప్పుడో వెళ్ళిపోయేరు. నడవొచ్చో లేదో అర్థం గావటం లేదు. వాళ్ళ వెనక నించొచ్చిన పదేళ్ళ కుర్రాడు పరుగెట్టుకుంటూ ఆ దార్లో వెళ్తుంటే వీళ్ళు ఫాలో అయ్యేరు. దాని పేరు ఐస్ పాసేజట.ఇలా రకరకాల వింతలూ విన్యాసాల్ని తిలకిస్తూ కళ్ళు చెదిరిపోయే క్రిస్టల్ గేలరీలోకి అడుగు పెట్టారు. ఊహించని విధంగా రాళ్ళతో అద్భుతమైన నగల్ని తయారు చేసి షో కేసుల్లో పెట్టారు. ప్రతీది ఖరీదైందే, మామూలు ఖరీదు గాదు. తన మిసెస్ కి చిన్న లాకెట్, చెవులకి రింగుల్లాంటివి కొన్నాడు యోగి. ఎంతయిందిరా అంటే వెయ్యి యూరోలన్నాడు. అంటే దగ్గర దగ్గర ఏభై వేలు. నడుచుకుంటూ ముందుకెళ్ళాడు జీవన్. టీ షర్టులూ, బ్రాలూ, బనియన్లు కూడా క్రిస్టల్ పొదిగి అమ్మకానికున్నాయి. ఒకచోట హరిప్రియా, అనిల్ కనిపించారు. ఒక సన్నటి గొలుసు హరిప్రియ మెడలో అలంకరిస్తున్నాడు అనిల్.

దాదాపు గంట తర్వాత బయటికొచ్చారు.అక్కడ షూటింగ్ అయిపోయిందట. అంతా బస్సు ఎక్కుతున్నారు. మమ్మల్ని ఏర్జమ్స్ పంపించెయ్యమని వేణు గార్ని అడిగేడు జీవన్. "దీని తర్వాత రైల్వే స్టేషన్లో షూటింగుంది. అక్కడ ట్రయినెక్కించేస్తాను. బస్సెక్కేసి మాతో వచ్చేయండి" అన్నాడు వేణు.

బస్సెక్కాకా పక్క సీట్లో ఉన్న చందర్రావు ని అడిగేడు జీవన్ "ఎలాగుందండి స్వరోస్కి క్రిస్టల్ వరల్డ్..?" అని.

"అవన్ని నిజం వజ్రాలు కావంట గదా..?" ప్రశ్నేసేడు చందర్రావు.

“ఔను” అన్నాడు

పెద్దగా నవ్వేసిన చందర్రావు “ఇక్కడ జనాన్ని చూస్తుంటే అప్పుడప్పుడూ ఈ తెల్లోళ్ళకి బుర్రలుండవని అనిపిస్తుందండి. లేకపోతే ఆ గాజు రాళ్ళని లక్షలూ కోట్లూ పెట్టి అలా కొనేసుకుపోతారా చెప్పండి..!?” అన్నాడు.

“అవన్నీ ప్రపంచమంతా పేరెల్లిన క్రిస్టల్సండీ”

“ఏవండీ, మీరేవన్నా అనుకోండి నన్నడిగేరు గాబట్టి నా అభిప్రాయం చెప్పేను తప్పంటారా..?”

జెన్బా వచ్చేం. స్టేషన్లో అక్కడా ఉన్నారు జనం. స్టేషనుకెదురుగా ఎత్తయిన కొండలు ఎంత అద్భుతం అనిపించేలా, ఆ కొండల మీద అక్కడా అక్కడా ఇళ్ళు.

జెన్బా స్టేషన్ని ఆన్చి ఒక పాతకాలం నాటి రైల్వే స్టేషను కనిపించింది. కాస్సేపటికి దూరంగా కనిపిస్తున్న కొండ మధ్యలోంచి ఒక బొగ్గు ఇంజను రెండు ఎర్రటి కంపార్ట్ మెంట్లని లాక్కొచ్చింది. దాన్నిండా టూరిస్టులు.

షూటింగ్ మొదలైంది.

జార్జి ప్రసాద్, యోగి, మిగతా అంతా ఆ పాతకాలం స్టేషను పక్కన బారుంటే అందులో కెళ్ళి కూర్చున్నారు. హెర్బల్ బీరట అది

ఆర్డర్ చేసేడు వేణు గారు.

టూరిస్టులని ఎక్కించుకుని ఈ ట్రెయినెటు వెళ్తుంది..? అనడిగాడు.

“ఆకెన్సీ” అన్నాడు.

“ఈ కొండకి అవతల పక్క ఇక్కడ షూటింగ్ అయ్యాకా మేం షిఫ్టయ్యేది అటే, మీరు సరదాగా ఈ ట్రెయినెక్కి వచ్చేయ్యగూడదూ..?” అన్నాడు జార్జి ప్రసాదు.

“మీరెళ్తే నేనూ వస్తాను” అన్నాడు గోవిందు. “నేను కూడా” అన్నాడు చందర్రావు.

అరవై యూరోలు తీసుకుని నలుగురికి టిక్కెట్లు కొనుక్కొచ్చాడు డ్రైవర్ ఉల్ఫి. ఆ టిక్కెట్లు పాతకాలం నాటివి. చిన్న చిన్న అట్టముక్కల్లాగున్నాయి.

మా నలుగురికీ కాస్త దూరంగా ఒక ముసలాయన కూర్చున్నాడు. బాగా వయసైన మనిషి పైన జర్కిన్ లోపల స్వెట్టర్. ఇంకా లోపల షర్టూ, బాగా లోపల బనియన్ వేసుకున్నాడు. తల మీద హేట్ ఉంది. షూ లేసులు గట్టిగా బిగించాడు. కట్టుడు పళ్ళు ఒక సారి తీసి మళ్ళీ పెట్టుకున్నాడు. ఈలోగా ఒక ప్రేమ జంట చేరింది. మాటాడ్తే చాలు ముద్దులు పెట్టేసుకుంటున్నారు వాళ్ళు.

ఓ రెండు పెట్టెల నిండా జనం నిండాకా మరి బయల్దేరింది రైలు. పాత కాలం గటప్ లో వచ్చిన టిక్కెట్ కలెక్టర్ పంచ్ చేస్తున్నాడు.పైన ఉడ్ ప్లాంటేషన్సూ, ఏపిల్ తోటలూ దాటుకుంటూ కొండ పైకి ఎక్కుతున్న రైలు బండి. పోను పోను అడవిలోకి చొచ్చుకుని పోవడంతో గాలి చల్లగా వీస్తుంది. ఆ అడివిలో చిన్న చిన్న దారులు కనిపించాయి. ఒక చోట నల్లటి వేన్ లో కూర్చున్న ఇద్దరు అందమైన అమ్మాయిలు పెట్లో ఉన్న అందర్నీ చూసి చేతులూపారు.

“ఎలాగుందండీ వాతావరణం..?” గోవిందునడిగాడు యోగి.

“చాలా గొప్పగా ఉందండి. నాకయితే రెండు కళ్ళు చాలడం లేదు” అన్నాడు గోవిందు.

మరి నన్నడగరేం అన్నట్టు చూసిన చూసిన చందర్రావుని “మీకెలాగుంది..?” అన్నాడు.

“మా రాజమండ్రి దగ్గర కడియం రైల్వే ట్రాక్ పక్కన కూడా ఇలాగే పచ్చగా ఉంటది” అన్నాడు.

నలభై అయిదు నిమిషాలకి ఈబెన్ స్టేషన్లో కొచ్చాగింది రైలు. కొబాయ్ సిమిల్లో రైల్వే స్టేషన్లాగుందది. అంతలో ఎదురుగా వస్తున్న ఇంకో రైలు దీనికెదురుగా వచ్చి ఆగింది. వీళ్ళక్కిన ట్రైన్ ఇంజన్ ఈ స్టేషన్ దాకా వెనకాల ఉంది. దాన్ని డీలింగ్ చేసి ముందుకి తగిలించారు.ట్రైను ముందుకి కదిలింది.

మూవ్ రాక్ స్టేషను రాగానే కూర్చున్న ముసలాయనా, ప్రేమికులూ దిగిపోయారు. టికెట్ కలెక్టరొచ్చి టిక్కెట్లు చూసి నెక్స్ స్టేషన్లో దిగాలి మీరు అని చెప్పి వెళ్ళిపోయాడు.

రైలు మళ్ళీ కదిలింది.

వెళ్తున్న రైలుకి ఎడం పక్కన రోడ్డు మైదానాల్లో అక్కడక్కడా అందమైన ఇళ్ళు. రైలు ఇంకొంచెం ముందుకెళ్ళగానే కళ్ళు చెదిరిపోయేంత అందమైన లేక్. “ఆకెన్సీలేక్” అంటే అదేనట. ఆ లేక్ లో కట్టబడి ఉన్న ఒకే ఒక అందమైన ఇల్లు. దాని మీద తివాగ్ (TIWAG) అని రాసుంది.

ఏంటింత పచ్చగా ఉంది ఎక్కడైనా ఏ ఎండిన చెట్టన్నా ఉంటే బాగుడ్ను అనిపించేంత పచ్చదనం, నీలం ఆకాశం, చల్లగా వీస్తున్న గాలి. మొత్తానికి అద్భుతం అనిపించే వాతారణం బాగుంది.

ఆ ప్రాచీనమైన స్టేషన్లో బెంచి మీద ఒంటరిగా కూర్చుని వయోలిన్ వాయించుకుంటున్నట్టు ఫీలై అటు పక్కకి పరుగెడ్తున్న వాడల్లా రైలు కదలడంతో వెనక్కొచ్చేశాడు.

ట్రైన్ ఇంజన్ మళ్ళీ వెనక్కి మార్చారు.

మధ్యాహ్నం 2:35 అయ్యింది. అఖరి స్టేషన్ కి చేరాక వేణుకి ఫోన్ చేశారు. మీరు దిగిన స్టేషన్నుంచి మూడు కిలోమీటర్ల దూరం నడిచి రండి. ఈ లోగా అక్కడికి నేనొచ్చేస్తా అన్నాడు వేణు.

మెయిన్ రోడ్ లో కార్లు పక్కనే కొంచెం కింద సైకిళ్ళ దారి, పక్కనే కాలి బాట. కుడి పక్క నీలం నీళ్ళతో లేక్. దాని మధ్యలో డబల్ డెక్కర్, మొత్తం లేక్ అంతా తిప్పుతుంది. పది యూరోలంట.

నడుచుకుంటూ ముందుకెళ్తున్న వీళ్ళకి టెలిఫోన్ బూత్ కనిపించే సరికి ఆగిపోయిన్ చందర్రావు ఒక్క నిమిషమండి, ఊరికి ఫోను మాటాడుకోవాలని వెళ్ళి జేబులో ఉన్న కార్డు ఫోన్ కింద గేప్ లోకి తోసి నెంబర్ డయల్ చేసేసి కాస్సేపయ్యాకా "హలో... హలో ఏవండీ హలో ఇండియా అండీ..? నేను... జర్మనీ అవతల ఆస్ట్రియాలో ఈ ఊరి పేరేంట్రా గోవిందూ, ఈడికి తెలిదంటండీ. హలో ఇండియా అండీ...? ఇండియా కాదు రాజమండ్రి అంటారా..., నాకదే కావాల్రా రంకు మొగుడా... ఎవరూ ఒరే అబ్బిగా ఒరే ఎదవా నేన్రా మీ నాన్నని ఫారన్నించిరా... ఏంటీ రాంగ్ నంబరా..? మరిందాకట్నించి చెప్పవేరా ఎదవా" అనేలోపు కార్డయిపోయింది.

"ఇంత తొందరగా అయిపోయిందేంటి...? ఖర్మ ఏం ఫారినో ఏం గోలో" అని తిట్టుకుంటుండగా నీలం రంగు కారు నడుపుకుంటూ వచ్చిన వేణు వీళ్ళని ఎక్కించుకుని లేక్ కి అవతల పక్కకి తీసుకెళ్ళాడు. షూటింగ్ అక్కడ జరుగుతుంది.

స్టాంపింగ్ కోసమొచ్చిన వేణుగారి మనిషి రాజశేఖర్రెడ్డి భోజనాలు పెట్టాడు. ఆ రోజు శనివారం పాతికేళ్ళ నించి ఆ పూట వెజిటేరియన్ తిని రాత్రి ఉపవాసం ఉంటున్న జీవన్ ఆ రోజు నాన్ వెజిటేరియన్ తినాల్సి వచ్చింది. వేరే ఏం లేవు వాళ్ళ దగ్గర.నీలం రంగు కారు చెట్టు కింద ఆపి సీటు వెనక్కి లాక్కున్న వేణుగారు నిద్రపోతున్నారు. జ్వరం వచ్చిందట. అటు చూస్తే హైదరాబాదు ఫోన్లు మాటాడుకుంటున్నాడు యోగి.ఓ గంట తర్వాత లేచిన వేణు వీళ్ళని తీసుకుని బయలుదేరాడు. దారో హాల్ అని ఒక ఏరు తగిలింది. అది హిస్టారికల్ ప్లేసట. దాని హిస్టరీని తర్వాత చెపుతానన్నాడు వేణు.

"ఏవండీ వేణు గారూ, ఆ సందీపూ, ప్రణయ్ తో పాటు ఇంకో ముగ్గురొచ్చారు మనతో వీళ్ళెవరూ సినిమా ఫీల్డుకి సంబంధించిన వాళ్ళు కాదు. మాతో పాటు ఎందుకొచ్చేరు అనడిగితే స్టాంపింగ్ కోసం అనంటున్నారు. ఏంటది..?" అనడిగాడు యోగి.

"అదా... వాళ్ళంతా ఎంబిఏ చేసిన మనుషులు అమెరికా వీసా ఈజీగా వస్తుంది. అందుకని వాళ్ళ సొంత ఖర్చులతో మనతో

పాటొస్తుంటారు..... ఇలాగ ట్రిప్పుకి ఒకో బేచ్ వస్తుంటారు" అన్నాడు వేణు.

"మీకెలా తెల్సు విళ్ళంతా..?"

"మా ఫ్రెండ్స్ ద్వారానో, బంధువుల ద్వారానో వస్తుంటారు."

సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో ఏగ్జమ్స్ వచ్చాం.

అక్టోబర్ – 9



హైదరాబాదు నుంచి ఫోనొచ్చింది సలీంకి. గబగబా దగ్గరకొచ్చి ఇండియాకి రెండు టిక్కెట్లు ఏర్పాటు చెయ్యండి చాలా అర్జంటు అని జార్జి ప్రసాద్ దగ్గరకెళ్ళి "ప్రసాదు భాయి నేనూ మా సిస్టరూ అర్జంటుగా వెళ్ళాల్సిన పని పడింది. చాలా అర్జంటు, దయచేసి షూటింగ్ పూర్తి చేసుకుని వచ్చెయ్యండి" అనేసి హడావుడిగా బయల్దేరాడు.వెళ్ళే ముందు కూడా ఫోనేం చెయ్యలేదు షహనాజ్. ఏవయ్యుంటది అన్న సందిగ్ధంలో పడిపోయేడు జీవన్.

"ఉన్నట్టుండి బయలుదేరిపోతున్నారేంటీ ఏవయి ఉంటుంది..?" అనడిగాడు జార్జి ప్రసాద్ ని.

"ఏమో సార్, ఇక్కడి కొచ్చినప్పట్రుంచి నాతో కూడా ఏం మాటాడ్డం లేదు. మొన్న నేనే నోరు తెరిచి అడిగితే మాట మార్చేశాడు సలీం భాయ్" అన్నాడు జార్జి ప్రసాద్.

“ఆ డాక్టర్ అబూకి వజీర్ పెట్టిన గడువు ఇంకా రెండు రోజులుంది. ఏవన్నా జరక్కూడనిది జరిగిందంటావా..?” అన్నాడు జీవన్.

“ఏమోనండీ” అనెళ్ళిపోయాడు. అంతా బస్సెక్కుతున్నారు.

షూటింగ్ లేంగ్ విమల్ట్ మౌంటెన్స్ దగ్గరట.ఆ కొండల మీద ఎక్కడ చూసినా మంచు కప్పబడి ఉంటుంది. మంచు తప్ప మరింకేం చూడలేం. భలే లొకేషను, అక్కడికి “ఇంత లేటుగా వెళ్ళడం ఏంటి..?” అన్నాడు జీవన్, డైరెక్టర్ వేగేష్ తో.

“షెడ్యూల్ చివర్లో వెళదాం అనుకున్నాం, ఇక రెండు రోజులేగా షూటుంగ్” అన్నాడు వేగేష్.

యోగి, జీవన్ బస్సెక్కారు.

“ఈరోజు ఎండ విపరీతంగా ఉంది గదా చందర్రావు గారూ..?” అన్నాడు జీవన్.

“మన ఎండల ముందు ఇదెంతలెద్దురూ..! ఏవండీ మంచు కొండల సినరీలో మనిద్దరం ఫోటోలు దిగుదాం ఏవంటారు...? రాజమండ్రి వెళ్ళాకా ఈ ట్రిప్పులో ఫోటోలన్నీ పెద్ద అల్బమ్ చేయిస్తాను. మా వీధిలో వాళ్ళూ, మిత్రులూ, శత్రువులూ వాటిని చూసి తెగ మురిసిపోవాలి ఏవంటారు..?” అన్నాడు.

కొండ దిగిన బస్సు ఇంతకు ముందొచ్చినప్పుడు మేం స్టే చేసిన “ఓబర్ పెర్ ప్యూస్” అనే ఊరుని టచ్ చేసి అట్నుంచి మళ్ళీ ఘాటీ ఎక్కింది.చాలా దూరం ప్రయాణం చేసిన తర్వాత వచ్చాయి లేంగ్ విమౌల్డ్ మౌంటెన్స్. పైకెళ్ళాలంటే ఎలక్ట్రికల్ కార్లెక్కాలి.ఆ లోకేషన్ చూసిన జీవన్ నోట్లోంచి మాట రాక అలా ఉండిపోయాడు.

ఇది వరకు మేం చూసినవి ఇవేనా..!? అనిపించింది. మొత్తం మంచంతా కరిగిపోయింది. కొండలన్నీ బోడి గుళ్ళు గీయించుకున్నట్టున్నాయి. వేణు దగ్గరకొచ్చిన డైరెక్టర్ వేగేష్ “ఇదేంటి సార్, చాలా గొప్పగా అనుకున్న ఈ లొకేషనిలాగుంది..?” అన్నాడు.

“నలభై సంవత్రరాల నుంచి ఇంత ఎండ ఎప్పుడూ కాయలేదట. ఈ ఏడాది కాసిన ఎండకి మొత్తం మంచు కరిగిపోయింది” అన్నాడు.అప్సెట్టయిపోయిన వేగేష్ “అందర్నీ దిగమనండి మొదలెడదాం” అంటునాడు.

అంతలో కొందరు జనం ఆ కొండల్లోంచి ఒక డెడ్ బాడీని మోసుకుని వస్తున్నారు. ఏంటా అని జీవన్, వేణు, యోగి అటెళ్ళారు.ముప్పై ఏళ్ళ క్రితం కెనడా నించి బార్యా భర్త పదేళ్ళ కుర్రాడూ ఈ టూరిస్టు ప్లేస్ కొచ్చారట. ఈ మంచు కొండలో ఆడుకుంటూ లోపలికెళ్ళిన ఆ కుర్రాడు మంచులోపలికి దిగబడిపోయి ఎంత వెతికినా కనబడలేదట. ఇన్నేళ్ళ తర్వాత కాచిన ఎండకి మంచు మొత్తం కరిగిపోవడంతో ఆ శవం బయట పడింది. దగ్గరకెళ్ళి చూస్తే ఇప్పుడే పది నిమిషాల క్రితం ప్రాణం పోయినట్టుంది.

ఆ మర్నాడు కెనడా నించి ముసలోళ్ళయిపోయి వచ్చిన ఆ కుర్రాడి తల్లిదండ్రులు ఆ శవాన్ని ఒక వేన్ లో ఎక్కించుకు తీసుకెళ్ళారట.

అక్టోబర్ – 10

ఆరోజు ఈ ఆస్ట్రియా షెడ్యూలుకి చివరి రోజు.

ఫెస్టంగ్స్ అనే లొకేషన్లో షూటింగ్ చేస్తుండగా ఇన్స్ బ్రూక్ నించి సినీటిరోల్ ఆస్ట్రియన్ ఫిలిం కమీషన్ వాళ్ళిచ్చారు. వాళ్ళంతా కో – ఆర్డినేటర్ వేణుకి ఫ్రెండ్స్. వాళ్ళతో ఈ సినిమా కేసెట్ ఓపెన్ చేయించారు.వర్షం మొదలైంది.మూడు గంటలకి షూటింగ్ పూర్తవ్వగానే అందరూ లంచ్ చేసేశాకా బయల్దేరిన బస్సు కూఫ్ స్టన్ మీదుగా ముంచెన్ వెళ్ళి అక్కడ్నించి మ్యూనిక్ ఎయిర్ పోర్ట్ కొచ్చింది.రాత్రి ఎనిమిది గంటలకట దుబాయ్ ఫ్లైట్.

ఎయిర్ పోర్ట్ లో ఉన్న రకరకాల షాప్స్ లో... చెక్ ఇన్ అని విత్తిన్ బ్రాకెట్స్ లో “లాస్ట్ మినిట్ షాపింగ్” అన్న పేరు గల షాపు పేరు చాలా నచ్చింది.

ఇంకా చెక్ ఇన్ టైం అవ్వలేదు గాబట్టి ఎయిర్ పోర్టంతా తిరుగుతున్నారు యూనిట్లో జనం. జీవన్ ని ఎక్కడికెళ్ళినా ఏం చేస్తున్నా వెళ్ళిపోయిన షహనాజ్ గుర్తుకొస్తుంది. ఆమె నీలి కళ్ళు గుర్తుకొస్తూనే ఉన్నాయి. ఆ మర్నాడు పద్నాలుగో రోజు ఏం జరగబోతుందా అన్న ఉత్కంఠ. గిలగిల్లాడుతున్నాడు జీవ.

ఒక పక్క చెక్ ఇన్ టైమవుతుంది. ఇంకా టిక్కెట్లు కన్ ఫర్మ్ కాక చాలా టెన్షన్ లో తిరుగుతున్న వేణు ని గోవిందెళ్ళి ఏవో అడిగితే లాగిపెట్టి కొట్టేసేడు.

అందరికంటే ముందు యోగికివ్వాలి. కాని, ఆ క్లాసులో జర్నీ ఎంజాయ్ చేస్తాను అని చందర్రావు రిక్వెస్ట్ చెయ్యడంతో అతనికిచ్చారు.లోపలికెళ్ళారు.

ఇందాక కనిపించిన షాపే ఇంకోటి చెకవుట్ అని విత్తిన్ బ్రాకెట్స్ లో "లాస్ట్ మినిట్ షాపింగ్" అని రాసి ఉంది. ఇది మన ఇండియాలో ఏ ఎయిర్ పోర్ట్ లో అన్నా ఎవరన్నా కాపీ కొట్టి ఈ షాపు పేరు పెడితే బాగుండును అనిపించింది. ఆ షాపులోకెళ్ళిన యోగి ఒక ఉలెన్ టోపీ పెర్ఫ్యూమ్సూ కొన్నాడు. చెక్ ఇన్ దగ్గర మెటల్ డిటెక్టర్ స్కేనింగ్ లో గోవిందు మోకాలు కింద కుయ్... కుయ్... మని సౌండు రావడం, వాళ్ళు మమ్మల్నందర్నీ ఆపెయ్యడం. వేణూ వాళ్ళని ఎంత కన్విన్స్ చెయ్యడానికి ట్రై చేసినా వాళ్ళు అవ్వకపోవడం. ఎప్పుడూ లేనంత చిరాకు పడిపోయాడు వేణు. చివరికి ఎప్పటికో వదిలారు.ఫ్లైట్ లోపలకెళ్ళాకా జీవన్ పక్కనే చేరాడు చందర్రావు. వాళ్ళకి కాస్త దూరంగా ఉన్న సీట్లో కూర్చుని ఉన్న నాలుగేళ్ళ పిల్లకి ఆడుకొమ్మని బొమ్మనిచ్చింది ఏయిర్ హోస్టెస్.

"నాకూ కావాలి" అన్నాడు చందర్రావు.

"ఎందుకూ..?" అన్నాడు జీవన్.

"మా మనవడికి ఆడుకోవడానికిస్తాను" అన్నాడు.

"మనం ఎనిమిది గంటల పాటు లాంగ్ జర్నీ చేస్తున్నాం గాబట్టి చిన్న పిల్లలకి మట్టుకే ఇస్తారు. అయినా ఫ్లైట్ దిగాకా తిరిగి ఇచ్చెయ్యాలి అవి" అన్నాడు జీవన్.

"తిరిగి ఇచ్చేసే దానికి తీసుకోడం ఎందుకు లేద్దురూ" అని ఏదో గుర్తొచ్చినట్టు పెద్దగా అరిచాడు.

ఏవయిందన్నాడు జీవన్.

చెప్పడం లేదు చందర్రావు.



ఇద్దరు ముగ్గురు మా చుట్టూ మూగి ఏవయిందన్నారు. అయినా చెప్పని చందర్రావు ఎప్పటికో నోరు విప్పి అన్నాడు. “చాలా తప్పు చేసేనండీ” అని.

“ఏవయిందండీ..?” అన్నాడు జీవన్. “మీతో పాటు ఆ మంచు కొండల సీనరీలో ఫోటో దిగుదాం అనుకున్నానా. దిగకండానే విమానం ఎక్కేసేం”

“అందుకా ఈ హడావుడంతా...? దుబాయ్ లో తీసుకుందాం” అన్నాడు జీవన్. “ఆ మంచు కొండలు అక్కడుంటాయా చెప్పండి. అక్కడంతా వేడేనట గదా..?” “దుబాయ్ కూడా మన జర్నీలో ఒక ఊరే గదా..! అయినా మీకు ఇంత ఫోటోల పిచ్చేంటి చందర్రావు గారూ...?”“ పిచ్చిగాదండీ, ఈ ఫోటోలు మా ముందు తరాల వాళ్ళంతా చూసి మా తాతయ్య గారు విదేశాలు పర్యటించేరని

మురిసిపోవాలి గదా..” చాలా తన్మయత్వంతో ఎటో చూస్తూ అన్నాడు చందర్రావు.

అక్టోబర్ – 11

ఉదయం ఆరు గంటలకి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లో లాండయింది ఫ్లైట్. చందర్రావు దగ్గర కొచ్చిన జార్జి ప్రసాదు “మన నాలుగు పాస్ పోర్టులూ ఎక్కడా..?” అన్నాడు. జేబులు తడుముకున్న చందర్రావు ముఖంలో టెన్షను పెరిగిపోతుంది. కళ్ళల్లోంచి నీళ్ళొచ్చేస్సేలాగున్నాయి. అతని వాలకం చూసిన జార్జి ప్రసాదు “ఎక్కడా పాస్ పోర్టులూ..?” అన్నాడు.

ఎక్కడో పారేసేనంటూ గొళ్ళుమన్నాడు చందర్రావు. చివరికని ఫ్లైట్లో చందర్రావు కూర్చున్న సీటు వెనక పడున్నాయి. రాత్రి పదీ నలభై అయిదుకట ఇండియా వెళ్ళే ఫ్లైటు. ఆ రోజు పద్నాలుగో రోజు, షహనాజ్ భవిష్యత్తు తేల్చే రోజు.ఫోన్ చేసి కనుక్కుందామనుంది జీవన్ కి.కానీ ఎలా...?

ఏమని..??

ఎప్పుడు హైదరాబాదులో దిగిపోదామా అనుంది. కానీ, ఎలాగా..?

నా దగ్గరున్న యూరోపియన్ కరెన్సీ తీసుకుని దరమ్స్ లోకి మార్చుకొచ్చిన జార్జి ప్రసాద్ అందరి దగ్గరికీ వచ్చి ఎవరి ఖర్చుల మీద వాళ్ళే వెళ్ళి సాయంత్రం ఏడు గంటల కల్లా ఇక్కడుండాలి అని గోవిందూ చందర్రావు లతో వెళ్ళిపోయాడు.

పక్కనే సిటీలో కొన్ని కొన్ని హోటల్స్ కి సంబంధించిన రిజర్వేషన్ కౌంటరుంది. కేపిటల్ హోటల్లో యోగి, జీవన్, వేగేష్ ఉండడానికి ఒక రూమ్ బుక్ చేశాడు యోగి. మీరు ఎయిర్ పోర్టు బయటికొస్తే హోటలుకి సంబంధిచిన మినీ బస్సు వస్తుంది. దాంట్లో బయల్దేరొచ్చు అంది కౌంటర్లో అమ్మాయి.

ఎయిర్ పోర్ట్ కొచ్చారు. తట్టుకోలేని వేడి, ఇన్నాళ్ళూ చల్లని ప్రదేశంలో హాయిగా ఉన్న వీళ్ళకి ఎప్పుడు ఏసీ రూములోకి దూరిపోదామా అనిపించింది. రకరకాల జనం రకరకాల హోటల్స్ కి సంబంధించిన కో – ఆర్డినేటర్సూ వస్తున్నారు. పాసింజర్లతో తిరిగి వెళ్తున్నారు గానీ ఈ కేపిటల్ హోటలు కి సంబంధించిన మనిషి మట్టుకి కనబడ్డం లేదు. ఎయిర్ పోర్ట్ బయట ఒక్కొక్కళ్ళు

ఒకో మూల కూలబడిపోయేరు. హరిప్రియ, అనిల్ నేల మీద పెట్టిన సూట్ కేసుని చెరి సగం పంచుకుని కూర్చున్నారు. ఎండ వేడి తట్టుకోలేక పోతున్న యోగి, తన ఒంటి మీదున్న స్వెట్టరూ, జర్కిను లాంటివన్నీ విప్పేస్తున్నాడు.

ఎప్పటికో దిగాడు ఆ కేపిటల్ హోటలు మనిషి. అదీ వీళ్ళ కోసం రాలేదట. ఒక అట్ట మీద రెండు పేర్లు రాసుకుని తిరుగుతుంటే పట్టుకుని వీళ్ళ గురించి చెప్పేరు. ఒక వేన్ లో అందర్నీ కురి తీసుకెళ్ళాడు.

కెపిటల్ త్రీ స్టార్ హోటలు. స్నానాలు చేసి కిందకి దిగే సరికి జార్జి ప్రసాదూ తనతో తీసుకెళ్ళిన గోవిందూ, చందర్రావూ కనిపించలేదు. అంతా కల్సి దిగిన హోటలుకి ఎదురు బిల్డింగ్ లో ఈట్ అండ్ డ్రింక్ అనే మలయాళపు వాళ్ళ హోటలుంది. అందులో ఇడ్లీలూ దోశలూ తిని టీ తాగారు. అక్కడ్నించి ఎక్కడి కెళ్ళినా ఏసియే. ఆఖరికి చిన్న షాపులో కెళితే అక్కడ టూ టన్ ఏసి ఉంది.

రెండు టాక్సీల్లో షాపింగ్ కి బయల్దేరారు. చూడ్డానికి అది అరబ్బుల ఊరయినా మళయాళం వాళ్ళెక్కువ. కారు డ్రైవరు మళయాళం వాడు. ఇందాక కేపిటల్ హోటలు డ్రైవరు కూడా మళయాళం వాడే. ఒక షాపులో యోగి, వేగేష్ కెమెరా స్టాండు కొంటుంటే అక్కడికొచ్చి చాలా బేరమాడి కుదరక పక్కనే ఉన్న షాపులో కెళ్ళారు. వాచీలు, ఒక కెమెరా కొంటుంటే అక్కడికొచ్చి చాలా బేరమాడి వెళ్ళిపోయిన చందర్రావు పేమెంటు మీద కెళ్ళి చైనా మేడ్ వి రెండు పెద్ద పెద్ద తాళం కప్పలు కొన్నాడు. ఆ షాపులోనే చాలా కొంటున్నాడు. ఈలోగా పక్క షాపునించి కెమెరా స్టాండు పట్టుకెళ్ళమని కబురు. చివరికి తేలిందేంటంటే రెండింటికీ ఓనరు ఒకడే. మూడున్నరయిపోయింది.మద్రాసులో ఫేమస్ వెజిటేరియన్ హోటల్ శరవణా భవన్ తాలూకు బ్రాంచి ఇక్కడ ఉంది.

ఆ హోటల్లో కెళ్ళి తమిళం మాటాడ్తుంటే పని చేసే వాళ్ళంతా వీళ్ళని చాలా ఆదరంగా చూసేరు. వాళ్ళలో ఒకతన్ది కుట్రాళం అట. ఇంకో కుర్రాడిది మధురై దగ్గర పల్లెటూరు. జీవన్ ఇళయరాజా గారి కూడా కంపోజింగ్స్ కెళ్ళినప్పుడు ఈ ఊళ్ళన్నీ తిరిగాడు. ఇదంతా మాటాడ్తుంటే సొంత ఊళ్ళు వదిలొచ్చి ఎన్నో ఏళ్ళవడం వల్ల ఇదిగా మాటాడారు జీవన్ తో.

శరవణా భవన్ నించి బయటికొచ్చి ముందుకి నడుస్తుంటే సముద్రంలో ఒక పాయ ఊళ్ళోకొచ్చేసి ఉంది. అవతల ఒడ్డున దింపడానికి మోటరు బోట్లున్నాయి. ఆ ప్రాంతం పేరు అబ్రా అంటారట. విపరీతమైన ఎండ తట్టుకోలేక పోతున్నారీళ్ళు.

అవతల ఒడ్డున దిగి కొంత దూరం నడిచే సరికి గోల్డు మార్కెట్లు కొన్ని వందల షాపులు ఎన్నో టన్నుల బంగారం రాసులు పోసి

అమ్ముతున్నారు. అయితే అక్కడ గోల్డు వ్యాపారం చేసే వాళ్ళంతా ఇండియన్ గుజరాతీస్.

అమాయకుడు అనుకున్న చందర్రావు మా అందరి కంటే ఎక్కువ బంగారం కొంటున్నాడు. నగల రూపంలో అయితే రేపు హైదరాబాద్ ఎయిర్ పోర్టులో కస్టమ్స్ వాళ్ళు టాక్స్ వెయ్యరు. బిస్కెట్లు అయితే మట్టుకి గట్టిగా పడ్తుంది టాక్సు. ఆ ముక్కే చెప్పి "వద్దయ్యా బాబూ" అంటే వినకుండా బిస్కెట్లే కొన్నాడు. ఎవరి దారిన వాళ్ళం హోటలు కొచ్చి అన్నీ సర్దుకున్నాం.

రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో హోటలు ఏసీ వేన్ వచ్చి విళ్ళని ఎయిర్ పోర్ట్ లో దింపింది.

లోపలున్న ట్వెంటీ ఫోర్ అవర్స్ షాపింగ్ కాంప్లెక్స్ లో అరబిక్ మ్యూజిక్ కేసెట్లూ సీడీలూ కొన్నాడు యోగి. జీవన్ స్టాన్లీ కూబ్రిక్ డైరెక్ట్ చేసిన ఓల్డ్ క్లాసిక్ ఫుట్ మెటల్ జూకెట్ డి.వి.డి కొన్నాడు.

హరిప్రియ, అనిలూ కల్సి అందరి కాంబినేషన్లో ఫోటోలు తీయించుకున్నారు.

హైదరాబాదులో లేండ్ అయ్యాకా కస్టమ్స్ వాళ్ళు మనిషికి మూడు బాటిల్స్ మించి ఒప్పుకోరు అంటున్నా వినకుండా మీరేదో చెపుతున్నారు గానీ మందేదిరా ఎదవా..? అంటే మా ఫ్రెండ్స్ కేం సమధానం చెప్పనూ అంటూ ఇరవై బ్లాక్ లేబిలు బాటిల్సు కొనేశాడు చందర్రావు.రాత్రి పదీ నలభై అయిదుకి ఫ్లైటు. ఇంకొన్ని గంటల్లో హైదరాబాదు చేరబోతున్నాం. పద్నాలుగో రోజు అయిపోయింది. ఆ షహనాజ్ ఎలాగుందో..? అసలెం తేలిందో..? రేపంతా అదే పని మీదుండాలి. దారి పొడుక్కీ అదే ఆలోచిస్తున్నాడు జీవన్.

అక్టోబర్ – 12

రెండున్నరకి హైదరాబాదులో లాండయింది ఫ్లైట్.

కస్టమ్స్ వాళ్ళ చేతుల్లో చాలా దారుణంగా ఇరుక్కుపోయాడు చందర్రావు.

వాళ్ళని కన్విన్స్ చెయ్యడానికి తనకి తెల్సున్న భాషలన్నీ ఉపయోగిస్తున్నాడు. ఫలానా ఎక్స్ ఎమ్మెల్యే గారికి కీప్ ఫ్రెండ్ నంటున్నాడు.దేనికీ చలించండం లేదు వాళ్ళు.జీవన్ లగేజి వచ్చేసింది.అంతలో వచ్చిన మూడు కార్లూ ఒక సఫారీ వేన్ లో ప్రపధమంగా పరాయి దేశం వెళ్ళిని యోగిని రిసీవ్ చేసుకోవడం కోసం అతని తాలూకు జనం వచ్చారు. మళ్ళీ దండలూ స్టిల్ కెమెరాలూ మామూలే.యోగి దగ్గరకెళ్ళిన జీవన్ "ఈ కంపెనీ వాళ్ళు నన్ను పికప్ చేసుకునే సరికి చాలా టైమవుద్ది. నీ బండిలో వచ్చేస్తాను" అంటే, "మేటిజ్ లో వెళ్ళిపోండి మా సాయిగారు దింపేస్తడు" అన్నాడు.

బయల్దేరాడు వాళ్ళ ఇంటి వేపు.

జార్జి ప్రసాదు నించి ఫోనొచ్చింది "షహనాజ్ ఆత్మహత్య చేసుకుంది సార్" అని.

"ఏమిటీ..???" అన్నాడు జీవన్.

"షహనాజ్ ఆత్మహత్య చేసుకుంది" అన్నాడు జార్జి ప్రసాద్.

అంతే...

కొన్ని క్షణాలు జీవన్ కి ఊపిరాడ్డం మానేసింది. యూరప్ వెళ్ళి వచ్చేలోపు జీవన్ ఎక్కిన విమానాలూ, రైళ్ళూ, ట్రామ్ బళ్ళు తన మీంచి కర్కశంగా వెళ్ళిపోయినట్టు అనిపించింది.

షహనాజ్ ఇంటికి బయలుదేరాడు. ఎందుకు చనిపోయింది షహనాజ్..?

ఎందుకు ఆత్మహత్య చేసుకుంది షహనాజ్..?షహనాజ్ మనసుకి గాయం చేసిందెవరు..?ఎవరు చేశారు...?అసలెందుకు చేశారు..? అన్నీ ప్రశ్నలు.

సరే కనుక్కొని సుఖమేంటి..?

షహనాజ్ లేనప్పుడు ఇక ఆ వివరాలు తెల్సుకుందామన్న కుతూహలం జీవన్ కి ఏ మాత్రం కలగడం లేదు. ఏదో కారణం తో ఆమెని శంకించి ఉంటారు. ఆమెకి తెల్సు అది నిజం కాదని. నా అనుకున్న వాళ్ళే అనుమానించే సరికి ఇక భరించలేక చనిపోయింది. ఇది లేకపోతే ఇలాంటిదే ఇంకోటి జరిగి ఉంటుంది.

ఇంటి ముందు జనం. ఆమె దర్శనం చేసుకుని ఏడుస్తూ వస్తున్నారు. హాల్లో పడుకోబెట్టారు.దగ్గరికెళ్ళాడు జీవన్.పరిమళ ద్రవ్యాలు జల్లారు. అగరవత్తులూ, గుగ్గిలం పొగలు రకరకాల పూలు. వాటి మధ్యలో నల్లటి బురఖా వేసుకుని ఉన్న షహనాజ్ శవం. ఎప్పటికీ తెరవని కళ్ళు ప్రశాంతంగా నిద్రపోతూ దర్శనం ఇచ్చే సరికి నమస్కారం చేశాడు జీవన్."అల్లా..... మహానుభావా ఏమిటీ వైపరీత్యం....?"

.....అయిపోయింది.....